Whatsapp No: 9440662699 www.rajadhanivartalu.com facebook.com/rajadhaniv RNI No. APTEL 2015/ 66622

# రాజధాని వార్తలు

Voice of Voiceless




అమరావతి సంపుటి : 2 సంచిక 45, పేజీలు 8 రూ. 2/- ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక జూలై సోమవారం 31- ఆదివారం 6, ఆగస్టు-2017

# చుక్కలో టమాటా..



### ఆగస్ట్ వరకు ఇంతే.. అదేదారిలో ఉల్లి

టమాటా ధరలు దిగివచ్చే సూచనలు కనిపించడం లేదు. దేశవ్యాప్తంగా 17 పట్టణాల్లో టమాటా ధరలు రూ.90 పలుకుతోంది. వీటిలో రాజధాని ఢిల్లీతోపాటు కోల్‌కతా, ఇండోర్, తిరువనంతపురం కూడా ఉన్నాయి. ఢిల్లీలో మూడు నెలల క్రితం రూ.26 ఉన్న టమాటా ఇప్పుడు రూ.92కు చేరింది. చెన్నైలో ఏప్రిల్ – జూలై మధ్య కాలంలో టమాటా ధరలు ఐదు రెట్లు పెరగడం గమనార్హం. అటు బెంగళూరులోనూ ఆరు రెట్లు పెరిగింది. వర్షాలు, వరదల కారణంగా పంట దెబ్బతినడంతో ఇప్పటికిప్పుడు సరఫరా పరిస్థితులు మెరుగపడే అవకాశాల్లేవని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. ఆగస్ట్ చివరి వరకు ఇదే పరిస్థితి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

మరోవైపు ఇన్నాళ్లు చల్లగా ఉన్న ఉల్లి ధర కూడా క్రమంగా పై వైపునకు

- మిగతా 2 లో

## సీఎఫ్‌టీఆర్ఐ యంత్రంతో అమ్మచేతి 'రాగిముద్దలు'



**రాజధానివార్తలు ప్రత్యేకం :** దక్షిణ భారత దేశంలో శతాబ్ధాలుగా 'రాగి' ముద్దలను ఆహారంగా తీసుకునే అలవాటు ఉంది. దీన్ని సంప్రదాయ ఆహారంగా ఇక్కడి తల్లులు తయారు చేస్తున్నారు. ఒకప్పుడు పేద,దళిత,రైతు కుటుంబాలు వీటిని ఆహారంగా స్వీకరిస్తే, మారిన ఆహారపు అలవాట్లు, కూర్చొని పనిచేసే ఉద్యోగుల్లో చాలామంది మధుమేహానికి, ఊబకాయానికి గురవుతుండటంతో ఆఫీసులకు వెళ్లేవారుకూడా దీన్ని ఆహారంగా తీసుకుంటున్నారు. దీనిలో తక్కువ గ్లైసీమిక్ ఇండెక్స్‌తోపాటు కాల్షియం, ఇనుము, పీచు పదార్థాలు ఎక్కువగా ఉండటంతో దీన్ని ఆహారంగా తీసుకునే సంఖ్య ఈ మధ్యకాలంలో గణనీయంగా పెరిగింది. రాగిముద్దను తయారు చేయాలంటే పాత్రలో నీళ్లను వేడి చేసి నీటిలో కలిపిన రాగిపిండిని వేస్తూ ఉండలు లేకుండా పెద్ద చెక్క గరిటె (తెడ్డు) తీసుకొని తిప్పుతూ తల్లులు తయారు చేసేవారు. ప్రస్తుత ఉరుకు పరుగుల జీవితంలో వాటిని తయారు చేయడం కష్టంతో కూడిన పని. దీంతో కుటుంబం అంతాకలసి రెస్టారెంట్లకు వెళ్లి రాగిముద్ద, నాటుకోడి మాంసం, లేదా రొయ్యల పులుసు ఆర్డర్ చేస్తున్నారు.హోటళ్లలో రాగిముద్దకు పెరిగిన డిమాండును దృష్టిలో పెట్టుకొని తృణధాన్యాల ఆహార వినియోగంపై దేశవ్యాప్తంగా అవగాహన కలిగిస్తున్న సీఎఫ్‌టీఆర్ఐ సంస్థ హోటళ్లలో రాగిముద్దతయారీకి యంత్రాన్ని రూపొందించింది. భారత ప్రభుత్వం, సైన్స్ అండ్ టెక్నాలజీ ఈ యంత్రానికి ఆర్థిక సహాయం అందించింది. ఈ యంత్రం ఆటోమెటిక్‌గా పనిచేస్తుంది. దీనిలో

- మిగతా 2 లో

## పులులను కాపాడండి

### సుదర్శన్ పట్నాయక్



**భువనేశ్వర్ :** పులుల సంరక్షణ గురించి అవగాహన కల్పించడానికి 2010 నుంచి ప్రతి ఏడాదీ జూలై 29న అంతర్జాతీయ పులుల దినోత్సవం జరుపుకుంటున్నారు. సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ తన శైలిలో పులుల సంరక్షణ గురించి ప్రచారం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆయన రూపొందించిన బెంగాల్ టైగర్ సైకత శిల్పం నెటిజన్ల మనసు దోచుకుంటోంది. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా మన జాతీయ జంతువు పులిని కాపాడతామని ప్రతిజ్ఞ చేద్దాం అంటూ ఆయన చేసిన ట్వీట్‌కు మూడు గంటల్లోనే 1000కి పైగా లైకులు, 300కి పైగా రీట్వీట్లు వచ్చాయి.

## పవన్ కల్యాణ్ కృషితో ఉద్దానం బాధితులకు హార్వర్డ్ బృందం పరీక్షలు



**ఉద్ధానం (శ్రీకాకుళం) :** జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కృషితో శ్రీకాకుళం జిల్లా ఉద్ధానం ప్రాంత కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మంచి రోజులు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆ ప్రాంతంలో కిడ్నీ సమస్యలు రావడానికి గల కారణాలను పరిశోధించడానికి హార్వర్డ్ శాస్త్రవేత్తల బృందం విచ్చేసింది. దశాబ్దకాలంగా ఉద్ధానంలోని ఏడు మండలాల్లో చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు కిడ్నీ సమస్యలు వస్తున్నాయి. వీటి వెనక అసలు కారణం మాత్రం ఇంతవరకు ఎవరికి అంతుపట్టలేదు. మూడు రోజుల పాటు హార్వర్డ్ బృందం విశాఖపట్నం, ఇచ్ఛాపురం, ఉద్ధానం ప్రాంతాల్లో పరిశోధన చేయనున్నారు. వీరికి తోడుగా ఆంధ్ర మెడికల్ కాలేజీ, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైద్యులు వుంటారు. పరిశోధనలో తేలిన విషయాల ఆధారంగా తదుపరి తీసుకోవాల్సిన చర్యల గురించి పవన్ కల్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబుతో శాస్త్రవేత్తల బృందం చర్చిస్తోంది.






# రాజధాని వార్తలు

కలం

## పనివాడు పందిరేస్తే...

చంద్రబాబు ప్రభుత్వం 1350 ఎకరాల్లో హైకోర్టు, అసెంబ్లీ భవనం, సచివాలయం,శాఖాధిపతుల భూములు,కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల కోసం భవనాల నిర్మించాలని తలపెట్టారు. రానున్న దసరాకు నిర్మాణాలను ప్రారంభించి 2019 మార్చి 31 నాటికి పూర్తిచేయాలని సమయ నిర్ధేశం చేశారు. కానీ ఇంతవరకు ఆకృతులను సదరు కంపెనీ అందించలేదు. ఆదరాబాదరా నిర్ణయాలకు ముఖ్యమంత్రి కేరాఫ్ అడ్రస్‌గా ఉంటున్నారు. పనులుసాగదీత ఎంత అనర్థమో అతి తొందర కూడా అంతే అనర్థం. అయితే చంద్రబాబు ప్రతీది అత్యవసరమే అన్నట్లు జరిపి, నిర్మాణాలు నాణ్యతగా జరిగే అవకాశం ఇవ్వడంలేదు. ప్లింత్ ఏరియా నుంచి ఒక్కొక్క విభాగం నిర్మాణం జరుగుతున్నప్పుడు సివిల్ ఇంజనీర్లు వివిధ పరీక్షలు జరుపుకుంటారు. దాంతో కట్టడంలోని భాగాలన్నీ నాణ్యతగా తయారయ్యే వీలుంటుంది. అలా కాకుండా పని మొదలు పెట్టినప్పటి నుంచి అయ్యిందా ? ఇంకా అవలేదా అని వారిని తీవ్ర వత్తిడికి లోను చేస్తే మళ్లీ తాత్కాలిక సచివాలయ భవన్నాల్లానే తయారవుతాయని మర్చిపోకూడదు. ఎనిమిది నెలలకాలంలో తాత్కాలిక నిర్మాణం పూర్తి చేశామని చెప్పుకునే ప్రభుత్వం నాణ్యత పై పెదవి విప్పడంలేదు. చినుకుపడితే తాత్కాలిక నిర్మాణాలన్నీ బడా..బడా కురుస్తుండటం కళ్లముందు కనిపిస్తున్నా ఇంకా తొందరపాటు నిర్ణయాలు ఎందుకు తీసుకుంటున్నట్లు ? ప్రజా ధనానికి విలువ ఇవ్వకపోవడం దారుణం. సచివాలయ లీకులపై మంత్రి నారాయణ మాట్లాడుతూ అవన్నీ చిన్న విషయాలని వాటిని పెద్దది చేయవద్దని కోరారు. దీని అర్థం ఏమిటి ? రూ. 9000 కోట్లు అంత చిన్నమొత్తంగా కనిపిస్తుందా మధ్యతరగతి, పన్నుల సొమ్ములవి. కాయకష్టం చేసి స్వేదంతో సంపాదించిన సొమ్ములను అంత విలువలేకుండా చూడటంపై ప్రజలంతా గుర్రుగా ఉన్నారన్న విషయం మర్చిపోకూడదు. చేసిన తప్పులే మళ్లీ మళ్లీ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవడం అత్యవసరం. విషయం ఏమంటే ఆగస్టు 15 నాటికి అసెంబ్లీ, 30 నాటికి హైకోర్టు భవన రూపకల్పనకు సంబంధించిన ఆకృతులను ఫోస్టర్ అండ్ పార్టనర్స్ అందిస్తారని సమాచారం. దీనిపై నిజానికి చర్చలు జరగాల్సిఉంటుంది.

హడావుడిగా సినిమా సెట్టింగులు వేసిన మాదిరి ఎందుకంత హడావుడిగా భవనాలను నిర్మిస్తున్నారంటే అది కేవలం రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే అని చెప్పక తప్పదు. అయితే ఇవన్నీ ఎన్నికలకు ఉపయోగపడినా రాబోయే కాలంలో మాత్రం దీని పర్యావసానాలను స్థానికులతోపాటు, రాష్ట్రప్రజలు ఎదుర్కొవలసి ఉంటుంది. ఇంకా చెప్పాలంటే ప్రభత్వ తొందరపాటు నిర్ణయాలతో కోటానుకోట్లరూపాయల దుబారా జరుగుతోంది. ప్రపంచస్థాయి రాజధాని నగరం అంటూ ఒక దిగువ మధ్యతరగతి తాటాకు ఇంటికంటే కూడా నాసిరకంగా కట్టడాలు నిర్మించడం రానున్న రోజుల్లో ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తుందని గుర్తించాలి. అలవికాని ఎన్నికల హామీలను గుప్పించి ప్రస్తుతం తీవ్ర ఒత్తిడికి లోనవుతున్న ముఖ్యమంత్రి రానున్న అసెంబ్లీఎన్నికల్లో తప్పనిసరిగా గెలవాలన్నదే లక్ష్యంగా పనిచేస్తున్నారని చెప్పనక్కర్లేదు. అయితే నిర్మాణాల అంశాల్లో మాత్రం రాష్ట్ర ప్రయోజనాలను, ప్రజల ఆకాంక్షను దృష్టిలో పెట్టుకొని నిర్మించాల్సిఉంది. అంతేకాని పనివాడు పందిరేస్తే.. పిచ్చుకలు వచ్చి పడేసినట్లు ఉండకూడదని రాష్ట్ర ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.




కాటూరు రవీంద్ర త్రివిక్రమ్
కన్సల్టింగ్ ఎడిటర్, హైకోర్టు న్యాయవాది
98495 68901/83309 68901
katuruRavindraTrivikram
@gmail.com

పౌరులు-చట్టాలు

## ప్రజాస్వామ్య దేవాలయం పార్లమెంటు

22

పార్లమెంటు ప్రత్యేక అధికారాలు : ప్రజాస్వామ్యంలో పార్లమెంటుని ప్రజాస్వామ్య దేవాలయం (temple of Democracy) గా వ్యవహరిస్తారు. పార్లమెంటు మీద ఉగ్రదాడి జరిగినప్పుడు ఈ పదాన్ని తరచుగావిన్నాం. ‘ దేవాలయం’ అనడానికి కారణం అక్కడ ప్రజలభవితకు, సంక్షేమానికి వరాలు లభిస్తాయి. అవే చట్టాలు/ శాసనాలు అయితే, ఏ చట్టమైనా రాజ్యంగ పరిధుల్ని అతిక్రమించకూడదు. ముందస్తు నిర్బంధం రెండు ప్రధాన విషయాలమీద ఆధారపడి ఉంది. 1) దేశ భద్రత 2) వ్యక్తిస్వేచ్ఛ. ఈ రెండింటినీ సమన్వయం చేస్తూ, దేనికీ నష్టం వాటిల్లకుండా చట్టాలు రూపొందించాల్సి ఉంది.



రాజ్యాంగ అధికారాణ 22(7) ప్రకారం, సలహాసంఘం అనుసరించాల్సిన విధానాలను అనుసరించాల్సి ఉంది. ఒకవ్యక్తిని అత్యధికంగా ఎంత కాలం నిర్బంధంలో ఉంచవచ్చో,అది కూడా 3 నెలల కాలపరిమితిని అధిగమించి, అనేది సలహా సంఘం అభిప్రాయంతో పనిలేకండా చేయగల అధికారం పార్లమెంటుకి ఉంది.

చట్టాలు దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యతప్రభుత్వ యంత్రాంగానిదే, ప్రత్యర్థులను నోరు మూయించడానికి కాకుండా వాస్తవంలో ఒక వ్యక్తి కారణంగా సామాజిక, దేశ భద్రతకు కీడు వాటిల్లే ప్రమాదం ఉన్నప్పుడు మాత్రమే ముందస్తు నిర్బంధం విధించాలి. అక్రమ నిర్బంధాలను అరికట్టడానికి కోర్టుల్ని ఆశ్రయించ వచ్చు.

దోపిడీకి వ్యతిరేకంగా హక్కు : ( అధికరణం 23 మరియు 24) సమాజంలోని బలహీన వర్గాలకు 23,24 అధికరణాలు కొన్ని హక్కులను హామీగా ప్రసాదించాయి. సమాజంలోని కుత్సితులు, చివరకు ప్రభుత్వమైనా సరే బలహీనులను దోపిడీ చేయకూడదు. దోపీడీ (Exploitation)కి విస్తృత అర్థం ఉంది. ముఖ్యంగా శ్రమ దోపీడీకి ఇది వర్తిస్తుంది.

వ్యక్తిస్వేచ్ఛ (21వ అధికరణం) విచక్షణకు నిరోధం (15వ అధికరణం) లకు అధికరణాలు 23,24 కొనసాగింపుగా చెప్పొచ్చు 23వ అధికరణం అమానవీయ అవినీతి చర్యన్ని, వెట్టిచాకిరీని సంపూర్ణంగా నిషేధించింది. 24వ అధికరణం పరిశ్రమల్లో పిల్లలను కార్మికులుగా ఉపయోగించడాన్ని నిషేధించింది.

1) మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరీ నిషేధం : (అధికరణం23) 23వ(1) అధికరణం మనవులతరలింపు వెట్టిచాకిరీలను కఠినంగా నిషేధిస్తోంది. అతిక్రమించినవారు చట్ట ప్రకారం శిక్షార్హులు.

స్త్రీ పురుషులను వ్యాపారస్తులుగా తరలించడం (Traffic) వారిని అమ్మడం, ఇతర విధాలుగా ఉపయోగించుకోవడం ఇవన్నీ ట్రాఫిక్ (Traffic) అనే మాటకి అర్థాలుగా చెబుతారు.

ముఖ్యంగా స్త్రీలను తరలించి అవినీతికి, వ్యభిచారానికి బలవంతంగా వినియోగించడం చట్టవిరుద్ధం ఇది అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు వ్యతిరేకం

1956లో దీనికి గాను SITA (Suppression of Immoral Trafficking Act) చట్టాన్ని చేశారు. దీని ప్రధాన ఉద్దేశం మానవ హక్కుల రక్షణ

23వ అధికరణంలో ‘బానిసత్వం’ గురించి స్పష్టంగా వివరించలేదు.కానీ I.P.C ( భారతీయ శిక్షాస్మృతి) సెక్షను 370లో దీనికి అవకాశం కల్పించారు.

సెక్షను370 ప్రకారం– “ ఎవరయినా ఒక వ్యక్తిని కొనడం, అమ్మడం.ఎగుమతి, దిగుమతి, చెయ్యడం బానిసగా చూడటం బానిసగా మార్చడం శిక్షార్హమైన నేరం”.

(సశేషం)

## రూ.5,599కే హైదరాబాద్-సింగపూర్ విమాన టిక్కెట్




**హైదరాబాద్ :** సింగపూర్ ప్రభుత్వానికి చెందిన సింగపూర్ ఎయిర్‌లైన్స్ అనుబంధ సంస్థ టైగర్ ఎయిర్‌వేస్ ఇకపై స్కూట్ ఎయిర్‌లైన్స్ బ్రాండ్‌నేమ్‌పై సేవలు అందించనున్నది. ఈ సందర్భంగా కంపెనీ ఇండియా హెడ్ భరత్ మహదేవన్ మాట్లాడుతూ.. ఒకే బ్రాండ్‌గా విమాన సేవలు అందించాలనే ఉద్దేశంతో తొమ్మిది నెలల తర్వాత స్కూట్, టైగర్‌ఎయిర్‌లను కలిపేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సంస్థ ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. హైదరాబాద్ నుంచి సింగపూర్ విమాన టిక్కెట్ ధరను ఒకవైపు రూ.5,599గా నిర్ణయించింది. దీంతోపాటు హైదరాబాద్–బాలీ మధ్య రూ.11,799గాను, హైదరాబాద్–హాంకాంగ్ మధ్య రూ.11,199, హైదరాబాద్–మెల్‌బోర్న్ మధ్య రూ.12,499, హైదరాబాద్–సిడ్నీల మధ్య టిక్కెట్ ధరను రూ.13,099గా నిర?యించింది. వచ్చేనెల 6లోగా బుక్ చేసుకున్న టిక్కెట్లకు మాత్రమే ఈ ఆఫర్ వర్తించనున్నది. ప్రస్తుతం సంస్థ హైదరాబాద్‌తోపాటు బెంగళూరు, కొచ్చి, తిరుచిరాపల్లి, లక్నోలకు విమాన సేవలను అందిస్తున్నది. వచ్చే ఏడు నుంచి ఎనిమిదేండ్ల కాలంలో హైదరాబాద్ నుంచి అంతర్జాతీయ మార్గాల్లో రోజుకు 12–15 విమాన సర్వీసులను నడుపాలనుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రస్తుతం హైదరాబాద్–సింగపూర్‌ల మధ్య రోజువారీ సర్వీసును నడుపుతున్నది. దేశీయ ప్రయాణికులను ఆకట్టుకోవడానికి కంపెనీ అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నదని, దీంట్లో భాగంగా పలు రాష్ట్రాల టూరిజం శాఖలతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన ప్రకటించారు. ఇప్పటికే రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు తుది దశకు చేరుకున్నాయన్నారు.

## చుక్కల్లో టమాటా..

(మొదటిపేజీ తరువాయి)

వెళ్లే సూచనలు కనిపిస్తున్నాయి. దేశంలోనే అతిపెద్ద ఉల్లి మార్కెట్ మహారాష్ట్రలోని లాసల్ గాన్ లో క్వింటాలు ఉల్లిగడ్డల ధర రూ.1,300కు చేరింది. ఇది 19 నెలల గరిష్ఠ ధర. గతంలో రోజుకు 25,000 క్వింటాళ్ల సరుకు రాగా, ప్రస్తుతం అది 12,000 క్వింటాళ్లకు తగ్గుముఖం పట్టింది. దీంతో ధరలు పెరుగుతున్నాయి. తాజాగా ఉల్లి సాగు లేదని, ప్రస్తుతం వస్తున్న పంట అంతా మార్చి, ఏప్రిల్ లో దిగుబడి అయిందని, స్టోరేజీల నుంచి వాటిని బయటకు తీస్తున్నట్టు మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. అయితే, చాలా మంది రైతులు ఇప్పటికే తమ పంటను అమ్మేసుకున్నట్టు చెబుతున్నారు. అంటే ఉన్న పంట అంతా వ్యాపారుల దగ్గరకు చేరినట్టు తెలుస్తోంది. దీంతో ధరపై ఇక వారిదే ఆధిపత్యం. ఈ క్రమంలో త్వరలోనే ఉల్లి కూడా కన్నీళ్లు తెప్పించే ధరకు చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## సీఎఫ్‌టీఆర్‌ఐ యంత్రంతో అమ్మచేతి ‘రాగిముద్దలు’

(మొదటిపేజీ తరువాయి)

ఆవిరిలో ఉడికిన రాగిముద్దను తయారవుతుంది. రాగిపిండి,నీటిని ఈ యంత్రంలోకి పంపితే ఒకే ఆకృతి,బరువు ఉండే ముద్దలు బయటికి వస్తాయి. దీంతో గంటకు 250 ముద్దలను తయారు చేయవచ్చు. ఈ యంత్రం ఖరీదు రూ. 3 నుంచి 3.50 లక్షలవరకు ఉంది. రెస్టారెంట్లు, హోటళ్లు, పారిశ్రామిక క్యాంటీన్లు, రక్షణరంగ క్యాంటీన్లు, విమానాశ్రయాల హోటళ్లలో ఈ యంత్రంతో పరిశుభ్రమైన అమ్మచేతి రుచితో రాగిముద్దలు తయారు చేయవచ్చు. దీనిని నిర్వహించడానికి ఒక్క వ్యక్తి చాలు. శుభ్రపరచడం చాలా తేలిక. ప్రధాని మేకిన్ ఇండియా పిలుపులో భాగంగా వీటిని తయారు చేస్తున్నారు. కర్ణాటకలోనే 100 యంత్రాలు అవసరముందని సర్వే చెబుతుందని మైసూర్‌లోని సీఎస్ఐఆర్ ఆధ్వర్యంలోని సీఎఫ్‌టీఆర్ఐ డైరెక్టర్ రామ్ రాజశేఖరన్ రాజధాని వార్తలకు తెలియచేశారు.

## ఇక నుంచి ఏసీ కోచ్‌లలో దుప్పట్లు వుండవు...

### భారతీయ రైల్వే నిర్ణయం

ఇటీవల కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ తన నివేదికలో కొన్ని రైల్వే జోన్లలో మూడేళ్ల నుంచి ఏసీ కోచ్‌లో ఉపయోగించిన బ్లాంకెట్లను ఉతకడం లేదని వివరిస్తూ భారతీయ రైల్వే పనితీరును తప్పుబట్టింది. అంతేకాకుండా ప్రతి మూడు రోజులకు ఒకసారి బ్లాంకెట్లను ఉతకాలని సలహా కూడా ఇచ్చింది. ఇలా చేయడం కుదరకపోవడంతో ఏసీ కోచ్‌లలో మొత్తానికే బ్లాంకెట్ అందుబాటులో ఉంచకూడదని భారతీయ రైల్వే నిర్ణయించుకుంది. దీనికి బదులుగా ఒక చిన్న పలుచని దుప్పటి సమకూర్చి, ఏసీ ఉష్ణోగ్రతను ప్రస్తుతమున్న 19 డిగ్రీల నుంచి 24 డిగ్రీలకు పెంచనున్నారు. నిజానికి ఒక్కో బ్లాంకెట్ శుభ్రపరచడానికి రైల్వేకి రూ. 55 ఖర్చవుతుంది. అయినప్పటికీ ప్రయాణికుల నుంచి కేవలం రూ. 22 మాత్రమే వసూలు చేస్తున్నట్లు రైల్వే శాఖ పేర్కొంది. ఇప్పటికే గరీబ్ రథ్ రైళ్లలో బ్లాంకెట్లకు బదులుగా పలుచని దుప్పట్లు సరఫరా చేస్తున్నారు.



# సిసింద్రీ పంతులమ్మ బాబోయ్!

నేను పనిచేస్తోన్న స్కూలు పక్కనే నీరజావాళ్ళిల్లుంది కానీ వెళ్ళడానికి వీలుపడదు.

'ఏవో సాకులు చెప్తావ్, ఎప్పుడూ రావ'ని రాత్రి ఫోన్లో బాగా సణిగింది. సరే, లంచ్ తర్వాత పీరియడ్‌లో ఎటూ క్లాస్ లేదు, లీజరే కనుక తర్వాతి పీరియడ్ సమయానికి వచ్చేస్తానని ప్రిన్స్‌పాల్‌కి చెప్పి బయల్దేరాను.

నే వెళ్ళేసరికి నీరజ చాలా దిగులుగా కూర్చుని వుంది. ఏంటలా ఉన్నావంటే అబ్బే ఏం లేదంటూ నేను వెళ్ళినందుకు ఆనందం వ్యక్తంచేసింది. నాకేవో మర్యాదలు చేయబోతే "నీ దగ్గరికి ఖచ్చితంగా వస్తానో లేదో తెలీదు కనుక రోజూలా బుద్ధిగా లంచ్‌బాక్స్ తెచ్చాను. రెండు నిమిషాల్లో అది కాస్తా లాగించి వచ్చాను. నువ్వు చెప్పదల్చుకున్నవన్నీ గబగబా చెప్పేస్తే నెక్స్ట్ పీరియడ్ టైంకల్లా వెళ్ళిపోవాలి" అన్నాను.

"సర్లే, అరిసెలన్నా తిను.. నేను చేయలేదులే, ధైర్యంగా తినొచ్చు" అంది.

"అరిసే తినాలా, అరవకుండా తింటే నడుస్తుందా?" అంటే నీరజ నవ్వింది.

నీరజ మాట్లాడుతోంది కానీ అదంతా తెచ్చిపెట్టుకున్న ఆనందమని తెలిసిపోతోంది. రెట్టించి అడిగాక గ్రీష్మ అస్సలు చదవడంలేదని బాధగా చెప్పింది.

"వార్నీ దీనికేనా అంత లావు దు:ఖం.. అక్కడికేదో మిన్ను విరిగి మీదపడ్డట్టు.. చెరువంత బాధను గుప్పెడు గుండెలో దాచుకున్నట్లు ఏం ఎక్స్‌ప్రెషన్లిస్తున్నావే తల్లీ" అంటూ సరదాగా ఆటపట్టించాను.

"నీకలాగే వుంటుంది. చద్దన్నం తిన్నావిడికి మొగుడాకలి తెలీదట. నీకేంటి, ఒక్కగానొక్క కొడుకు చదువైపోయింది.. ఎంచక్కా ఉద్యోగం చేస్తున్నాడు. నా బాధ నీకెలా అర్థమౌతుంది గౌరీ?" అంది నీరజ.

"వాడితో ఏ ఇబ్బందీ పడకుండానే పెద్దయిపోయాడంటావా? సర్లే చరిత్రలు మొదలెడితే లాంగ్‌బెల్ టైమవుతుంది గానీ, అసలైనా గ్రీష్మ ఎందుకు చదవడంలేదు? ఇంటర్లోబ్రహ్మాండమైన మార్కులొచ్చాయిగా?!" అన్నాను.

"రానురాను రాజుగుర్రం గాడిదైన చందంగా తయారైంది. నిజానికి ఇంటర్లో కంటే బీటెక్‌లో ఇంకా శ్రద్ధగా చదవాలి. అలాంటిది ఇప్పుడసలు చదువుమీద ధ్యాసే లేదు. ఎన్ని బ్యాక్‌లాగ్స్ ఉన్నాయో!" అంది నీరజ బాధగా.

"ఎందుకు చదవడంలేదో కనిపెట్టలేదా?"

"ఎంతసేపూ టీవీనే.. టెక్స్ట్ పుస్తకాల మొహమన్నా చూట్టంలేదు"

"ఇది క్రూషియల్ టైం, ఇప్పుడు చదవకపోతే ఆనక బాధపడాల్సొస్తుందని మంచిగా చెప్పిచూడకపోయావా?"

"చెప్పకుండానే ఉన్నానా? నోరు నొప్పి పుట్టేదాకా చెప్పినా చెవులకెక్కించుకోవడంలేదు. నయాలూ భయాలూ అన్నీ అయినయి, అస్సలు గ్రహించుకోవడంలేదు"

"పోనీ కేబుల్ కనెక్షన్ తీయించేయండి"

"వామ్మో, ఇంకేమైనా ఉందా?"

"అదేంటి, అలా అంటావ్?"

"మీ అన్నయ్యకి నిద్రపక్కమీంచి లేస్తూనే రిమోట్ చేతిలో ఉండాలి.. అత్తగారు కొన్ని సీరియల్స్‌కి అలవాటుపడ్డారు, ఆవిడ అవి చూడకుండా ఉండలేరు. వేణుకి మ్యూజిక్ ఛానల్సూ, క్రికెట్ మ్యాచ్‌లూ కావాల్సిందే.." అంటూ నీరజ లిస్టు చదివింది.

"వీళ్ళంతా చూడగా గ్రీష్మకి టీవీ ఎప్పుడు ఖాళీగా దొరుకుతోంది?" అన్నాను.

"ఆవిడ టైంలు ఆవిడకున్నాయిలే"

"అయినా ముగ్గురు పెద్దవాళ్ళే టీవీకి అంతగా అలవాటుపడితే చిన్నదాన్ని ఎలా తప్పుపడతాం? ముందు వాళ్ళతో టీవీ మాన్పించు. ఎదురుగా అయస్కాంతంలా ఆకర్షిస్తుంటే చిన్నపిల్లకదా టెమ్ట్ అవుతోంది. పిల్ల చదువు ముఖ్యమని పెద్దవాళ్ళు అర్థంచేసుకోవాలి. గ్రీష్మ బీటెక్ పూర్తయ్యేదాకా కేబుల్ కనెక్షన్ ఉండదని గట్టిగా చెప్పు.. నీ మాట వినకపోతే పంతులమ్మ వచ్చి పాఠాలు చెప్తుందని నా పేరు చెప్పు" అన్నాను నవ్వుతూ.

నీరజ కూడా నవ్వేసింది.

-లేఖ

# అందం చూసే మనసుండాలేగానీ..



అందం ప్రసక్తి వచ్చినప్పుడల్లా 'నఖశిఖపర్యంతం' అనడం తెలిసిందే! అంటే గోటి దగ్గర్నుంచి ముఖం వరకూ ఎక్కడికక్కడే బోల్డంత అందం దాగుంటుంది. చూసే మనసుండాలేగానీ ప్రతిదాన్లో అందాలు వెతుక్కోవచ్చు. అందుకు కావల్సిందల్లా కాసింత చక్కగా కనిపించాలనే తపనా, అందుకవసరమైన ఓపికా.. అంతే! ముఖంమీద అందరూ శ్రద్ధపెడతారు కానీ గోళ్ళ విషయం చాలామంది పెద్దగా పట్టించుకోరు. కానీ, ఈ తరం పిల్లలు వాటిమీద కూడా చాలా శ్రద్ధపెడుతున్నారు. నెయిల్ ఆర్ట్ ఇప్పుడు బడా ఫ్యాషనైపోయింది.

పాత తరంవాళ్ళు మహా అయితే గోళ్ళని కాస్త షేప్‌చేసి నెయిల్‌పాలిష్ వేసేవారు. ఆ రంగులు కూడా ఎరుపుకు సంబంధించిన షేడ్స్ మాత్రమే వుండేవి. ఇప్పుడలా కాదు.. నలుపు, ఆకుపచ్చ, నీలం, పసుప్పచ్చలతో సహా లేత, ముదురు.. వందల షేడ్స్ నెయిల్‌పాలిష్‌లు దొరుకుతున్నాయి. పైగా ఒకే రంగు వేయడం ఔట్‌డేటెడ్ ఫ్యాషన్. ఎన్నెన్ని రంగులో, ఎన్నెన్ని డిజైన్లో! బియ్యపుగింజమీద చార్మినార్‌ను చెక్కినట్లు చిన్నిగోరుమీద అనంతకోటి డిజైన్లతో మెరిపిస్తున్నారు, మైమరపిస్తున్నారు.

తమ గోళ్ళమీద స్వయంగా కళానైపుణ్యం చూపించేవారు కొందరైతే, బ్యూటీ పార్లర్లలో డిజైన్లు వేయించుకునేవాళ్ళు ఇంకొందరు. పెళ్ళిళ్ళు పేరంటాల్లాంటి ప్రత్యేక సందర్భాల్లో నెయిల్ ఆర్ట్‌కు మరీ డిమాండ్ పెరుగుతోంది. ప్రస్తుతం నెయిల్ ఆర్టుకున్న క్రేజును కనిపెట్టి కొందరు బ్యూటీషియన్లు దీనిమీద కొంత కసరత్తుచేసి మరింత ఆకర్షణీయమైన డిజైన్లు సృజించి మెప్పిస్తున్నారు. ఇదిలా వుండగా 'నెయిలార్ట్ ఫర్ ఆల్' అనే యాప్ కూడా వచ్చింది. అందులో పూలూ లతలు మొదలు మిక్కీమౌస్‌లూ డ్రాకులాల వరకూ వేల డిజైన్లు ఉంటాయి. ఎవరికి వారు తమ అభిరుచి, సమయ సందర్భాలకు అనుకూలమైన డిజైన్లను ఎంచుకుని వేసుకోవచ్చు. ఎంత బావుంది కదూ!

ముఖం తర్వాత శరీరంలో బాగా ఎక్స్‌పోజ్ అయ్యేది చేతులే. మరి ఆ చేతులకున్న వేళ్ళూ గోళ్ళూ అందంగా, ఆకర్షణీయంగా కనిపించాలంటే, తోటివాళ్ళనుండి పదిమార్కులు అదనంగా కొట్టేయాలంటే గోళ్ళకి తగిన ప్రాధాన్యత ఇవ్వాల్సిందే! ఇందుకోసం ఏమంత కష్టపడాల్సిందేం వుంటుంది చెప్పండి?! కాస్తంత యూషేప్ చేసుకుని వివిధ రంగుల నెయిల్‌పాలిష్‌లతో డిజైన్లు వేయడమేగా! మనకి రాకపోతే స్నేహితులతో వేయించుకోవచ్చు. లేదంటే నెయిలార్ట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసేసుకోవచ్చు.

# 23 నిముషాల్లో వైజాగ్- తిరుపతి

- ముందుకొచ్చిన హైపర్‌లూప్ సంస్థ
- అధ్యయనం చేయాలని సీఎం సూచన

**రా.వా.ప్రతినిధి-విజయవాడ :** మెట్రో రైలును మించిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యంత వేగంతో కూడిన రవాణా వ్యవస్థను అమరావతి రాజధానిలో ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఇందుకు తగ్గ వ్యవస్థను నెలకొల్పేందుకు హైపర్‌లూప్ ఒన్ సంస్థ ఆసక్తి కనబర్చగా, సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాల్సిందిగా ముఖ్యమంత్రి సీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. ఈ రవాణా వ్యవస్థకు సంబంధించిన విశేషాలను బుధవారం సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన సీఆర్‌డీఏ సమీక్షా సమావేశంలో ఆ సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. హైపర్‌లూప్ రవాణా వ్యవస్థ సాకారమైతే అమరావతి నుంచి విశాఖపట్నం కేవలం 23 నిముషాల్లో,తిరుపతికి 25 నిముషాల్లో చేరుకోవచ్చునని వారు తెలిపారు. అలాగే అమరావతి నుంచి హైదరాబాద్, ముంబై, బెంగళూరు, చెన్నయ్‌కు కూడా విమానం కన్నా వేగంగా చేరుకోవచ్చునన్నారు. దీనిపై ఆసక్తి కనబర్చిన ముఖ్యమంత్రి తక్షణమే అధ్యయనం జరపాలని అధికారులకు సూచించారు. ఈ రవాణా వ్యవస్థ ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకునేందుకు సిద్ధంగా వున్నామని, పరిశోధనా కేంద్రాన్ని కూడా అమరావతిలో ఏర్పాటు చేస్తామని హైపర్‌లూప్ ఒన్ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. అనంతరం అతిథ్యరంగంపై చర్చలో భాగంగా రాడిసన్, లీలా, తాజ్, జీఆర్టీ, పార్క్, నోవాటెల్ వంటి 8 జాతీయ, అంతర్జాతీయ సంస్థలు అమరావతిలో స్టార్ హోటల్స్‌ను నిర్మించేందుకు ముందుకొచ్చాయని సీఆర్‌డీఏ అధికారులు వెల్లడించారు.


## 1నుంచి కొత్త రూ.200 నోట్లు

**న్యూఢిల్లీ :** రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా ఆగస్టు1 నుంచి రూ.200 నోట్లను చెలామణిలోకి తీసుకు రానుంది జూన్ 1 నుంచి ముద్రణ మొదలు పెట్టామని ఇప్పటికే నెల రోజులు పూర్తవుతున్నాయని ప్రభుత్వాధికారి ఒకరు తెలిపారు. చిల్లర సమస్య అధికంగా ఉండటంతో రూ.200 నోట్ల ముద్రణ చేపట్టామన్నారు. దీంతో నగదు చెలామణి పెరుగుతుందన్న ఆశాభావాన్ని బ్యాంకులు తెలిపాయి. మార్చిలో రూ.200 నోటుపై నిర్ణయం తీసుకున్నామని ఆర్థిక మంత్రిత్వశాఖ అధికారి ఒకరు తెలిపారు. మైసూరు సాల్బొని ముద్రణాలయాల్లో నూతన నోట్ల ప్రింటవుతుండగా నాణ్యతా ప్రమాణాలను ఇప్పటికే పరిశీలించారన్నారు ఈ నోట్ల చెలామణి ఊపందుకోగానే రూ.2000 నోట్లను తగ్గిస్తామని అధికారి వెల్లడించారు.

# కరకట్ట పనుల వేగం పెంచాలి

## సీఎం చంద్రబాబు

**రా.వా.ప్రతినిధి, అమరావతి :** నూతన రాజధాని అమరావతి రవాదానికి అద్దంలాంటి రహదారుల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టి పనులను సైతం వేగవంతంగా చేపట్టారు. అయితే కృష్ణ కుడి కరకట్ట పనుల్లో మాత్రం జాప్యం జరుగుతోంది. అత్యంత ప్రాధాన్యత ఉన్న కృష్ణ కరకట్టపై సర్వత్రా చిన్నచూపు కనిపిస్తోంది.అమరావతి రాజధాని ప్రాంతానికి 40 కిలోమీటర్ల దూరాన్ని తగ్గించే కరకట్ట మార్గంపై మొదటి నుంచి నేతలు చిన్నచూపు చూస్తున్నారు. కనుక దుర్గవారధి దిగువ నుంచి రేపల్లె మండలం పెనుమూడి వరకు సుమారు 58 కిలోమీటర్లు పొడవునా రహదారి నిర్మించాలని గతంలోనే నిర్ణయించారు. దీనికోసం 2010లో రూ.111 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో ఉన్న కరకట్టను మట్టితో చదును చేయడం, పైభాగం వెడల్పు చేయడం, దానిపై తారురోడ్డు వేయ్యాలని నిర్ణయించారు. దీంతోపాటు కృష్ణజిల్లా ఎడమ వైపు కరకట్టకు నిధులు కేటాయించారు. అయితే ఆ కట్ట పనులు 5 ఏళ్ల క్రితమే పూర్తయ్యాయి. అయితే గుంటూరు వైపు కుడి కరకట్ట మాత్రం మన నేతల నిర్లక్ష్యం వలన నేటికీ మోక్షం లభించలేదు. కరకట్ట పనులు ముందుకు సాగకపోవడానికి ప్రధాన కారణం రెవిన్యూ శాఖ భూసేకరణే,58 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించాలని ప్రాతిపదనలు చేస్తే దానిలో 50 కిలోమీటర్ల మేర పనులు పూర్తి అవ్వగా తారురోడ్డు నిర్మాణం జరిగింది నామమాత్రమే. ప్రస్తుతం దుర్గ వారధి నుంచి పెనుమూడి వరకు పనులు జరగాలంటే 44 ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉంది. రేపల్లె, కొల్లూరు భట్టిప్రోలు మండలాలో నది పరివాహక ప్రాంతాల్లో భూసేకరణ జరగాల్సి ఉంది. తాడేపల్లి, దుగ్గిరాల మండలాలలో కేవలం 4 ఎకరాలు సేకరిస్తే సమస్య 9 శాతం కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. రాజధానిని తీర్చిదిద్దడంలో తనదైన ముద్ర వేసుకున్న చంద్రబాబు కాస్తంత కరకట్టపై మనసు పెడితే కృష్ణ తీర ప్రాంత ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయి. దుగ్గిరాల మండలం పెదకొండూరు, తాడేపల్లి మండలం తాడేపల్లి విజయవాడ క్లబ్ ప్రాంతంలో 3 కిలోమీటర్ల రోడ్డు కోసం 4 ఎకరాలు సరిపోతుంది. కొల్లూరులో మరో 800 మీటర్ల భూమిని ఒక ఉద్యోగి నుంచి సేకరించాల్సి ఉంది. కొల్లూరు నుంచి పెనుమూడి వరకు కరకట్ట పనులు పూర్తి కాకున్నా దానికి సమాంతరంగా ఆర్అండ్‌బి రహదారున్నాయి.



విజయవాడ ప్రాంతంలో కరకట్ట అంచు వెంట ప్రభుత్వ భూమి ఉన్న కొన్నేళ్ళుగా పేదలు ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారు. వీరిని ఖాళీ చేయించే విషయంలో అడ్డుపడిన అధికార పార్టీ నేతలు వారికి మరో ప్రాంతంలో స్థలం చూపి తరలించే విషయంపై దృష్టి పెట్టలేదు. ఇక్కడే కట్టకు నదివైపు భూములను సేకరించాలని సూచించారు. కాని రాజధాని ప్రాంతం కావడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో రైతులు ప్రభుత్వ స్థలం వదిలి మా భూములు తీసుకుంటే ఎలాగంటూ కోర్టులను ఆశ్రయించారు. అయితే ఆక్రమించుకున్న భూముల్లో చాలా వరకు పేదలు ఇళ్లు అమ్ముకుని వెళ్లిపోయారు. వారిలో నిజంగా అర్హులైన వారిని గుర్తించి మరోచోట స్థలం చూపిస్తే సమస్య తీరిపోతుంది. ముఖ్యమంత్రి ఈకుడి కరకట్ట రహదారి నిర్మాణంపై ఉన్న అడ్డంకులపై చొరవ చూపిస్తే నది తీర ప్రాంత వాసులు రాజధానికి చేరుకోవడానికి సమయం తగ్గే అవకాశం ఉంది.

## ప్రీస్కూల్స్‌గా అంగన్‌వాడీలు

రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూల్స్‌గా మారుస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. దీనిలోభాగంగా పట్టణ ప్రాంతాల్లోని 3,128 అంగన్‌వాడీ కేంద్రాలను ఏకీకృతం చేసి 1,026 ప్రీస్కూలు సెంటర్లుగా మార్పు చేయనున్నట్లు తెలిపారు. సుమారు 90 వేల మంది పిల్లలు ఈ సెంటర్లలో చదువుకోవడానికి వీలుగా సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రీ స్కూల్స్ వల్ల వేలాది చిన్నారులను ప్రయోజకులను చేసే అవకాశం కల్గుతుందన్నారు. తరగతి గదుల్లో గోడల్లో గోడలమీద అందమైన తైలవర్ణచిత్రాలు ఆకర్షించే ఆట వస్తువులు, కుర్చీలు, బల్లలు, ఆహ్లాద వాతావరణం వుండాలని ఇందుకోసం ఒక్కో ప్రీ స్కూల్ సెంటర్‌కు ప్రభుత్వం రూ.2.40 లక్షలు వ్యయం చేస్తుందన్నారు. చిన్నారుల ఆరోగ్యం కోసం పౌష్టికాహారం అందించాలని, పసితనం నుంచే మంచి అలవాట్లు నడవడిక నేర్పాలని అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, సిబ్బందికి ఉద్భోధించారు. ప్రీ స్కూల్స్ నిర్వహణ బాధ్యతను పురపాలక పట్టణాభివృద్ధిశాఖ, స్త్రీశిశు సంక్షేమశాఖలు స్వీకరిస్తాయని తెలిపారు. మూడేళ్ళ వయస్సున్న చిన్నారులు నర్సరీ 4ఏళ్లుంటే ఎల్‌కేజీ, 5సంవత్సరాలుంటే యూకేజీ చదివేందుకు అవకాశం వుంటుందని సీఎం వివరించారు. అంగన్‌వాడీ టీచర్లకు ఆంగ్ల మాధ్యమంలో రైమ్స్ నేర్పడంలో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఇప్పటివరకు అంగన్‌వాడీ వర్కర్లుగా వున్న తమను టీచర్లుగా గుర్తించినందుకు వారు సీఎం చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలిపారు.

# అందుకా ? అలా చేశారు...!





వెంకయ్యనాయుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులు జాన్‌జిగ్రీ దోస్తులు.. రాష్ట్రంలోని ప్రతికార్యక్రమం లో వెంకయ్య పాల్గొంటారు. ఆపై పరస్పరం పొగడ్తలతో ముంచెత్తుకుంటారు. ఇదొక ప్రహసనం.. చూసీ..చూసీ జనం విసుగెత్తిపోయారు. కేంద్రం నుంచి అదనంగా ఏమాత్రం నిధులు అందించకపోయినా కేంద్రానికి ఆంధ్రప్రదేశ్ అంటే ప్రత్యేక (ప్రత్యేక హెూదా అటకెక్కింది) అభిమానం అంటూ వెంకయ్యనాయుడు చాలా గొప్పగా మాట్లాడుతారు. అయితే నాకు రాష్ట్రపతిపదవిపై మోజులేదు అంటున్నాకూడా ప్రధాని మోడీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాలు బలవంతంగా ఉపరాష్ట్రపతిగా నామినేషన్లు వేయించారు. ఎందుకిలా చేశారని ఆరా తీస్తే చాలా విషయాలు బయటికి వచ్చాయి. నాయుళ్లు ఇద్దరూ కలసి బీజేపీని రాష్ట్రంలో ఎదగనీయడంలేదని, తెలుగుదేశం పార్టీ ఆగడాలను విమర్శించే అవకాశం లేనందున అందువల్ల ఆపార్టీతో తెగతెంపులు చేసుకుందామని అధిష్టానికి ఎంతచెప్పినా వెంకయ్యనాయుడు కొరుకుడు పడనీయడం లేదని తేలడంతో ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తుంది. అయితే అంతకంటే భయంకరమైన నిజాలు ఇంకా చాలా ఉన్నాయి. అవేమిటంటే వీరిద్దరూ కలసి జాతీయస్థాయిలోని అన్ని తమ సామాజిక వర్గానికి చెందినవారికే అన్ని పదవులు కట్టపెడుతున్నారని, దానిలో హెచ్‌సీయూ వైస్ ఛాన్సలర్‌పదవి నుంచి నేషనల్ అకాడమీ ఫర్ రిసెర్చ్ మేనేజ్‌మెంట్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిసెర్చ్ , సెంట్రల్ రిసెర్చ్ ఇన్సిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్‌తోపాటు అత్యంత కీలకమైన పదవుల్లో వారి సామాజిక వర్గానికి పెద్దపీట వేయడం వెంకయ్యనాయుడు కేంద్రమంత్రిగా నియమితులయ్యాకే జరిగిందని జాతీయ మీడియా తెలిపింది. ఇలాంటి విషయాలు ఆంధ్రప్రదేశ్ మీడియా ఎటువంటి పరిస్థితుల్లోనూ బయటపెట్టడంలేదు..ఎందుకంటే ఇక్కడి మీడియా కూడా ఆ వర్గాల గుప్పిట్లో బందిఖానా అయ్యింది. మరీ ముఖ్యంగా హెచ్‌సీయూలో రోహిత్ వేముల ఆత్మహత్య తర్వాత వైస్ ఛాన్సలర్‌గా తన వర్గానికి చెందిన అప్పారావుకి వైస్‌ఛాన్సలర్ పదవి దక్కడం వెనుక వెంకయ్యనాయుడి హస్తం ఉందని జాతీయ ఆంగ్ల మీడియా బయటపెట్టింది. తమ వర్గానికి చెందిన వారికే పదవులను కట్టబెట్టేందుకు సీనియర్లను తొక్కేస్తున్నారని కంచె ఐలయ్య విమర్శిస్తుండగా, దీనిపై రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలని ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండు చేస్తున్నారు. పద్మ అవార్డుల విషయంలోనూ ఇదే తంతు జరిగిందని, ఆంధ్రప్రదేశ్‌కు 6 పద్మ అవార్డులు రాగా, వాటిలో ఐదింటిని ముఖ్యమంత్రి కేంద్రమంత్రి తమ వర్గానికే ఇప్పించుకున్నారు. రామోజీరావుకు పద్మవిభూషణ్, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, వెంకటరామారావుకి పద్మభూషణ్, అవార్డులు రాగా, నాయుడమ్మ యార్లగడ్డ, ఆళ్ల గోపాలకృష్ణకు పద్మశ్రీ అవార్డులు దక్కాయి. పైగా వీరిలో నలుగురు కృష్ణా,గుంటూరు జిల్లాలకు చెందినవారే.. జాతీయ దినపత్రికలు వీటిని బహిర్గతం చేసేముందే ఇంటెలిజెన్స్ వర్గాలు ప్రధానిమోడీకి ఈ సమాచారాన్ని చేరవేశాయి. దీంతో ఇతర కులాల్లో అసంతృప్తి వెలువడుతోందని గ్రహించిన కేంద్రం పథకం ప్రకారం వెంకయ్యనాయుడిని ప్రత్యక్ష రాజకీయాలనుంచి వేరుచేసిందని తెలుస్తోంది.

చట్టసభల్లో తమ సామాజిక వర్గానికి చెందిన వారి సంఖ్య చాంతాడంత ఉంది. నారా చంద్రబాబు, (కుప్పం) (ఏపీ ముఖ్యమంత్రి) ముప్పవరపు వెంకయ్యనాయుడు ,యలమంచలి సుజనాచౌదరి, గరికపాటి మోహనరావులు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తుండగా, కంభంపాటి హరిబాబు, (విశాఖపట్నం), మాగంటి మురళీమోహన్ (రాజమండ్రి), మాగంటి వెంకటేశ్వరరావు(ఏలూరు) కేశినేని శ్రీనివాస్ (విజయవాడ) గల్లా జయదేవ్ (గుంటూరు) రాయపాటి సాంబశివరావు (నరసరావుపేట) లు ఉన్నారు.ఎమ్మెల్యేలుగా వెలగపూడి రామకృష్ణబాబు (విశాఖ తూర్పు) వేగుళ్ల జోగేశ్వరరావు (మండపేట)పెందుర్తి రమేష్ (రాజానగరం) గోరంట్ల బుచ్చయ్యచౌదరి (రాజమండ్రిరూరల్) బూరుగుపల్లి శేషారావు (నిడదవోలు) అరుమిల్లి రాధాకృష్ణ, (తణుకు), గన్ని వీరాంజనేయులు (ఉంగుటూరు) చింతమనేని ప్రభాకర్ (దెందులూరు) వల్లభనేని వంశీమోహన్ (గన్నవరం) కొడాలి వెంకటేశ్వరరాఉ (గుడివాడ) వైసీపీ, కామినేని శ్రీనివాస్ కైకలూరు (బీజేపీ) బోడే ప్రసాద్ (పెనమలూరు)గద్దెరామ్మోహన్‌రావు (విజయవాడ తూర్పు), దేవినేని ఉమామహేశ్వరరావు (మైలవరం),కొమ్మలపాటి శ్రీధర్ (పెదకూరపాడు) ధూళిపాళనరేంద్ర (పొన్నూరు) ఆలపాటి రాజేంద్రప్రసాద్ (తెనాలి) ప్రత్తిపాటి పుల్లారావు ( చిలకలూరిపేట)కోడెల శివప్రసాదరావు (సత్తెనపల్లి) వీఎస్ ఆంజనేయులు (వినుకొండ), ఎరపతినేని శ్రీనివాసరావు( గురజాల) గొట్టిపాటి రవికుమార్ (అద్దంకి) ఏలూరి సాంబశివరావు(పర్చూరు) దామచర్ల జనార్ధన్‌రావు (ఒంగోలు)పోతుల రామారావు (కందుకూ వైసీపీ) కురుకొండ రామకృష్ణ (వెంకటగిరి), బొల్లినేని రామారావు (ఉదయగిరి), ఉన్నం హనుమంతరాయ చౌదరి (కల్యాణదుర్గం) పరిటాల సునీత (రాప్తాడు), గోనుగుండ్ల సూర్యనారాయణ (ధర్మవరం), నందమూరి బాలకృష్ణ ( హిందూపూర్), వైకుంఠ ప్రభాకర్ చౌదరి (అనంతపురం రూరల్)లు ఉన్నారని జాతీయ పత్రికలు వెల్లడించాయి.

### ఏపీ శాసన మండలి సభ్యులు

నారాలోకేష్ వట్టికూటి వీరవెంకన్న చౌదరి (తూర్పుగోదావరి జిల్లా) యలమంచిలి బాబూరాజేంద్రప్రసాద్ (కృష్ణాజిల్లా)నన్నపనేని రాజకుమారి (గుంటూరు) పయ్యావుల కేశవ్ (అనంతపూర్)

### జిల్లా పరిషత్ చైర్మన్‌లు

ముళ్లపూడి బాపిరాజు (పశ్చిమగోదావరిజిల్లా), గద్దె అనురాధ ( కృష్ణాజిల్లా), ఈదర హరిబాబు (ప్రకాశం), శ్రీరామినేని గీర్వాణి (చిత్తూరు), పిన్నమనేని ఉదయభాస్కర్ చైర్మన్ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్‌కమిషన్)

### రాష్ట్రాధికారులు

చంద్రబాబు అధికారం చేపట్టాక డీజీపీ రాములు ప్రస్తుతం ఎన్ సాంబశివరావు పనిచేస్తున్నారు ఏపీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్‌బాబు (కృష్ణా) ఏపీ అడ్వకేట్ జనరల్ దమ్మలపాటి శ్రీధర్, సీఎం ఓఎస్‌డీ ఇన్ ఢిల్లీ తేలప్రోలు శ్రీనివాస్ (ఖమ్మం) సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జాస్తి చలమేశ్వర్ (కృష్ణా) జస్టిస్ ఎన్వీరమణ(కృష్ణా), జస్టిస్ లావు నాగేశ్వరరావు (గుంటూరు) ఉన్నారు.

ఈ విధంగా రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ చట్టసభల్లో ఆ వర్గాలు వేళ్లూడుకున్నాయని నివేదికలు తెలుపుతున్నాయి. ఇంతేకాకుండా వెంకయ్యనాయుడు కుమారుడి హర్షటయోటా, కుమార్తె స్వర్ణభారతి ట్రస్ట్ మూడేళ్లల్లో భారీ ఆస్తులు కూడబెట్టారని కూడా ఆరోపణలు ఉన్నాయి. ఇవికూడా కేంద్రం దృష్టికి వెళ్లాయి. స్వర్ణభారతి ట్రస్టుకు రూ. 2కోట్ల రాయితీని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రకటించగా, నూతనంగా ఏర్పాటయినా తెలంగాణ రాష్ట్రంలో పోలీసు వాహనాలకోసం హర్షటయోటాలో పెద్దమొత్తంలో వాహనాలను నిబంధనలను అతిక్రమించి రాష్ట్రం కొనుగోలు చేసిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తెలుగురాష్ట్రాలు ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానిమోడీ, అమిత్‌షాలు అమలుచేయాలనుకున్న రాజకీయాలకు వీరిద్దరి రాజకీయాలు అడ్డంకిగా మారడంతో వెంకయ్యనాయుడిని క్రియాశీలక రాజకీయాల నుంచి తప్పించినట్లు తెలుస్తోంది. నిజానికి మోడీ,అమిత్‌షాలకు చంద్రబాబు అంటే అంత మంచి అభిప్రాయం లేదు. చంద్రబాబు యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా ఉండగా గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న మోడీ ఆయన అపాయింట్‌మెంట్ కోరగా ఇవ్వలేదని కూడా చెబుతున్నారు. ఇదే సమయంలో వెంకయ్య ఉపరాష్ట్రపతి నామినేషన్‌కు వస్తానన్నా చంద్రబాబును రావద్దన్నారని గుసగుసలు ఉన్నాయి. వెంకయ్యనాయుడిని చంద్రబాబును వేరుచేయడంతో ఎన్‌డీఏ ప్రభుత్వం కృతకృత్యం అయింది. ప్రస్తుతం రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రులుగా ఉన్న అశోక్ గజపతిరాజు హుందాగా ఉంటారు. సుజనా చౌదరి ఫక్తు వ్యాపారి, రాజకీయాల్లో కొత్తవారు దీంతో ప్రస్తుతం కేంద్రంలో ఏం జరుగుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. కేంద్రానికి రాష్ట్రానికి మధ్య సమాచార ఖాళీ ఏర్పడింది. రాజకీయాల్లో బహుసీనియర్ అయిన చంద్రబాబు ఎలా తన మాస్టర్ ప్లాన్‌తో ఎలా ఎదుర్కొంటారో వేచి చూడాల్సిందే.

– ఖాన్

# పన్ను ఎగవేతదారుల కోసం 'ఆన్‌లైన్' వేట

ఆదాయం పన్ను ఎగవేతదారులను వల వేసి పట్టుకునేందుకు ఆదాయం పన్నుశాఖ ఆన్‌లైన్ బాట పట్టాలని నిర్ణయించింది. కోట్లాది రూపాయలు సంపాదిస్తూ విలాసవంతమైన కార్లు, బంగ్లాలు కొనుగోలు చేస్తున్న వారు కూడా తక్కువ పన్నును చెల్లించడం లేదా ఎగవేయడం షరామామూలుగా మారిపోయింది. ఇప్పటిదాకా ఇలాంటి వారికి సంబంధించి తమకు లభించిన సమాచారం ఆధారంగా ఆయా వ్యక్తుల ఇళ్లను, కార్యాలయాలు సోదా చేసి వారి ఆదాయానికి అనుగుణంగా పన్ను చెల్లించకపోతే ముక్కు పిండి వసూలు చేస్తున్నారు ఐటీ శాఖ అధికారులు. అయినప్పటికీ చాలా మంది పన్ను ఎగవేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆన్‌లైన్ బాట పట్టాలని ఆదాయం పన్ను శాఖ నిర్ణయించింది. ఈ రోజుల్లో సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ట్విటర్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వాటిని అందరూ వినియోగిస్తున్నారు. వీటిని ఆధఃరంగా చేసుకునే పన్ను ఎగవేతదారులను పట్టుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆగస్టు నుంచే ఈ ఎన్నును ప్రారంభించాలని ముహూర్తం ఖరారు చేశారు. సామాజిక మాధ్యమాల్లో చాలా మంది తాము కొనుగోలు చేసిన కొత్త కారు లేదా ఇళ్లను ఇతర విలాసవంతమైన వాటి ఫొటోలను పోస్ట్ చేస్తుంటారు. కారు, ఇల్లు వంటి వాటిని తమ డబ్బుతోనే కొనుగోలు చేసినా తమ పేరుపై కాకుండా ఇతరుల పేర్లతో రిజిస్టర్ చేస్తుంటారు. కొంత మంది తమ పేరుతోనే కారును కొనుగోలు చేసినా దానికి ఆదాయం ఎక్కడి నుంచి వచ్చిందో తెలియజేయరు. ఈ నేపథ్యంలోనే వ్యక్తులు తమ ఆదాయానికి సంబంధించిన సమర్పించిన రిటర్నులు, వారు చేసున్న ఖర్చులు సమంగా ఉన్నవీ లేనిదీ ఆదాయం పన్ను శాఖ పరిశీలించనుంది. ఈ నెల 30తో ఆదాయం పన్ను రిటర్నుల గడువు ముగియనుంది. తర్వాతి నుంచే వ్యక్తులకు సంబంధించిన ఆన్‌లైన్ వేట మొదలుకానుందని తెలుస్తోంది. ఆన్‌లైన్ బాటలో పన్ను ఎగవేతదారులను పట్టుకోవడం ద్వారా పన్ను పరిధిలోకి పెద్ద ఎత్తున కొత్త వారిని తీసుకురావడానికి అవకాశం ఉంటుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. వినూత్న పంథాలో పన్ను ఎగవేతదారులను పటుకునేందుకు ప్రభుత్వం ప్రాజెక్ట్ ఇన్‌సైట్ అనే కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందు కోసం 1,000 కోట్ల రూపాయలు వెచ్చించింది. మొదటి దశలో వచ్చే నెల నుంచి రెండో దశలో డిసెంబర్ నుంచి ఈ ప్రాజెక్టును అమలు చేయడానికి సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నట్టు ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి. సోషల్ మీడియాను వినియోగిస్తున్న చాలా మంది తమ పుట్టిన తేదీ, మొబైల్ నెంబర్ వంటి వాటిని తెలియజేయాల్సి ఉంటుంది. కొన్ని రకాల ఉత్పత్తులను కొనుగోలు చేసినప్పుడు వారి మొబైల్ నెంబర్, అడ్రస్‌ను వెల్లడిస్తుంటారు. ఇలాంటి డేటాను మొత్తం విశ్లేషించి సంబంధిత వ్యక్తి నుంచి పన్ను రాబట్టేందుకు ఆదాయం పన్ను శాఖ కసరత్తు చేస్తోంది. పన్ను ఎగవేతదారులను పట్టుకునేందుకు బెల్జియం, కెనడా, ఆస్ట్రేలియా తదితర దేశాలు బిగ్ డేటా ద్వారా పన్ను ఎగవేతదారులను పట్టుకోవడంలో విజయం సాధించాయి.

# బీజేపీ పంజాకు 'మహాగద్బంధన్' గడబిడ



బీజేపీయేతర రాష్ట్రాల్లో కేంద్రం చిచ్చుపెడుతోంది. ఎదోలా ఆయా రాష్ట్రాల్లో పాగా వేసేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోంది. బీహార్‌లో దాని ప్రయత్నాలు విజయవంతం అయ్యాయి. ఒకప్పటి సోషలిస్టు త్రయంలో నితీష్, లాలూ ప్రసాద్, నితీష్‌లు ఉన్నారు. వీరంతా ప్రస్తుతం వారి సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చి వారసత్వ రాజకీయాలు అమలు చేస్తున్నారు. నితీష్‌కు అవినీతి, వారసత్వ మకిలి అంటనప్పటికీ లాలూతో సహ బీజేపీయేతర పార్టీలతో పొత్తు పెట్టుకుని రాష్ట్రంలో విజయదుంధుబి మోగించడంతో ఒక్కసారి అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకంగా మారింది. మొన్నటి ఉత్తరప్రదేశ్‌లో ఎన్‌డీఏ ప్రభుత్వం జైత్రయాత్ర సాగించినప్పుడు కూడా నితీష్‌లా మహాకూటమి (మహాగద్బంధన్) ఎందుకు పెట్టుకోలేకపోయామా అని బహుజన్ సమాజ్‌వాదీపార్టీ (మాయావతి), సమాజ్‌వాదీపార్టీలు వగచాయి. అప్పటికీ సమాజ్‌వాదీపార్టీ కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకున్నప్పటికీ అది పెద్దగా ఫలించలేదు. బీజేపీయేతరపార్టీలకు రోల్‌మోడల్‌గా ఉన్న నితీష్ కాలక్రమేణా తన రాజకీయ వ్యూహాన్ని మార్చుతూ ఊసరవెల్లిగా మారారు.

2015లో బీహార్‌లో అధికారం చేపట్టిన నితీష్ సంపూర్ణమద్య నిషేధం అమలు చేయడంతో రాష్ట్రఖజానా నింపడానికి కేంద్ర సాయం అర్జిస్తున్నారేమో అనుకున్నారు గాని, బీజేపీ చెప్పుచేతల్లోకి వెళతారని మాత్రం ఎవరూ అనుకోలేదు. ఎందుకంటే ఒక ఖూనీకోరు, మతోన్మాది మోడీని ఎన్‌డీఏ తరపున ప్రధానిమంత్రి అభ్యర్థిగా ఉండటమేమిటని నితీష్ బీజేపీ నుంచి బయటకు వచ్చారు. మళ్లీ అంతలోనే వారిపై ఎందుకు మోజు పుట్టిందో తెలియదు. దేశంలోని సామాన్య ప్రజలంతా అష్టకష్టాలు పడ్డా నోట్లరద్దుకు జై పలికారు. యూపీఏ అభ్యర్థికి కాకుండా ఎన్‌డీఏ రాష్ట్రపతి అభ్యర్థికి ఓట్లు వేశారు. లాలూ ఇంటిపైకి సీబీఐని ఉసిగొల్పారు. అయినా లాలూ మాట్లాడలేని స్థితి, ఈ పరిస్థితుల్లోనే కూతురు మీసాభారతి, కుమారుడు, ఉపముఖ్యమంత్రి తేజస్వియాదవ్‌పై సీబీఐ అనేక కేసులు వేసింది. నిజానికి మహాకూటమి ఏర్పాటు సమయానికే దాణాస్కాంలో జైలుపాలైన లాలూతో నితీష్ చెట్టపట్టాల్ ఏంటని? చాలా మంది నిలేశారు. అయినా ఆయన 'మహాగద్బంధన్'తో విజయం సాధించారు. ఆయన పుట్టినరోజు వేడుకల్లో హాజరై కేకు తినిపించారు. ఉపముఖ్యమంత్రిని తప్పించి వ్యూహాత్మకంగా అధికారం నుంచి ఆయన్ను వేరుచేశారు. నిజానికి లాలూతో నితీష్ వేగగలరా అనుకున్నారు కాని మహారాజకీయ చతురుడైన లాలూకే ఆయన చుక్కలు చూపారు.

**- ఖాన్**



**ప్రజాద్రోహి నితీష్**

ప్రజలు ఓట్లు వేసింది మహాకూటమికి, ఈరోజు ఆయన ప్రభుత్వం ఏర్పాటు చేసింది బీజేపీతో అంటే అది ఖచ్చితంగా ప్రజాద్రోహమే.. తన పదవికోసం, ఉన్నతికోసం అంతదారుణంగా ప్రవర్తిస్తారని ఎవరూ అనుకోలేదు. అయినా పదవి ఎలాంటి పనులైనా చేయిస్తుందనటానికి ఇదొక ప్రత్యక్ష ఉదాహరణ. అధికారంలో లేని కాంగ్రెస్ ప్రభుత్వం నితీష్‌కు ఖచ్చింతంగా గౌరవిస్తుందనడంలో సందేహం లేదు. ఎందుకంటే వాటికి అధికార రాష్ట్రాల మద్దతు చాలా అవసరం. అందుకే ఎటువంటి తొందరపాటు నిర్ణయం తీసుకోకుండా రాహుల్ అనేక సార్లు నితీష్‌తో చర్చలు జరిపారు. ప్రసుత బీజేపీలో ప్రజాస్వామ్యం విలువలు లేవు. అవన్నీ వాజ్‌పేయితోనే పోయాయి. ఉన్న మోడీ,అమిత్‌షాల ద్వయం రాజ్యవిస్తరణ కాంక్షలో ఎలాంటి ప్రజావ్యతిరేక కార్యక్రమం అయినా చేయడానికి సిద్ధంగాఉన్నారు. ఈరోజు నితీష్‌ను ఉపయోగించుకుంటున్నారు. రేపు ఉపముఖ్యమంత్రి అయిన రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, సుశీల్‌కుమార్ మోడీ కేంద్రంలోని అధికారంతో ఆయన్ను పదవీచ్యుతుడ్నిచేయరన్న గ్యారెంటీ ఎమీలేదు. తెలుగురాష్ట్రాల్లో అధికారపార్టీ ప్రతిపక్ష పార్టీల సభ్యులను ఫిరాయింపులకు ప్రోత్సహించివారికి మంత్రిపదవులు కూటా కట్టపెట్టి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తే, మతతత్వపార్టీ పంచన చేరి ఎన్నికల్లోని మహాకూటమిని హత్య చేసి రాజకీయమకిలిని అంటించుకున్నారు నితీష్. బహుశా ఇదే మోడీ, అమిత్‌షాలు ఆయన్ను వాడుకొని కూరలో కరివేపాకులా ఒదిలేస్తే చెప్పుకుంటానికి కూడా ఎవరూ లేరు. ఎందుకంటే ప్రజలు, ప్రతిపక్షాల మద్దతును నితీష్ కోల్పోయారని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. నితీష్ చరిత్రలో ఒక ప్రజాస్వామ్య ఘాతుకుడిగా గుర్తుండిపోతారు.

## మహిళా క్రికెటర్లకు

# భారత్ మిథాలియా



క్రీడలన్నింటిలో క్రికెట్‌కు దానిలో కూడా పురుషుల క్రికెట్‌కు మాత్రమే విశేష ఆదరణ ఉన్న మన దేశంలో మహిళా క్రికెటర్లు సువర్ణాధ్యాయాన్ని లిఖించారు. వసతుల లేమి, చాలీచాలని నిధులు, ఆదరణ కరవైన దశలోనూ మన మహిళా క్రికెటర్లు అవాంతరాలను అధిగమించి, సవాళ్లను ఎదురొడ్డి యావత్తు మహిళాలోకం గర్వపడేలా చేశారు. ఈ ఘనతకు మిథాలీ రాజ్ సూర్పిదాతగా నిలిచారు. ఇంగ్లండ్‌లోని లార్డ్స్‌లో జరిగిన మహిళల ప్రపంచకప్ ఫైనల్‌లో మన క్రికెటర్లు ఓడినా.. దేశ ప్రజల మనస్సులు గెలుచుకున్నారు. తుది వరకూ పోరాడి తొమ్మిది పరుగుల తేడాతో విజయానికి దూరమైనా.. భారత్ క్రికెట్ చరిత్రను తిరగరాశారు. మునుపెన్నడూలేని విధంగా యావత్తు దేశమూ వనితల క్రికెట్‌నూ ఆస్వాదించేలా చేయగలిగారు. వాస్తవానికి ఈ ప్రపంచ కప్పు క్రికెట్ పోటీలు ప్రారంభం నాటికి భారత జట్టుపై పెద్ద అంచనాలేమీ లేవు. బహుశా ఆఖరి నాలుగు జట్లలో ఒకటిగా ఉంటుందేమో అనుకున్నారంతా! కానీ జట్టు సమష్టి కృషి,అంకితభావం, క్రమశిక్షణతో అనూహ్యంగా రాణించింది. అందరి అంచనాలనూ తలకిందులు చేస్తూ ఒక్కో దశ దాటుకుంటూ ఫైనల్‌కి చేరింది. ఊహించని ఉత్కంఠను రేపిన ఈ ఫైనల్ గేమ్‌లో ఓటమి అభిమానులకు కొంత నిరాశ కలిగింది, ఉండవచ్చు. అయితేనేం... అత్యుత్తమ ఆట తీరుతో జాతి అభిమానాన్ని చూరుగొన్నారు. పురుషుల క్రికెట్ మాదిరిగానే మహిళల క్రికెట్‌నూ అందరూ చూసే






రోజురావాలని దాదాపు దశాబ్దమున్నర కాలంగా ఎన్నో కలలు గన్న మిథాలీ రాజ్ కోరికను నిజం చేసింది. ఆమె సాధించిన రికార్డుల వెనుక ఎంతో కఠోర పరిశ్రమ దాగి ఉంది. వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్‌ల్లో ఆరువేల పరుగులు సాధించిన తొలి మహిళగా ఆమె రికార్డు సృష్టించారు. గతంలో ఇంగ్లండ్ క్రీడాకారిణి ఎడ్వర్డ్ పేరిట ఉన్న 5992 పరుగులను అధిగమించింది. అంతర్జాతీయ మహిళా క్రికెట్‌లో 51.52 సగటు రికార్డుతో సరికొత్త చరిత్రను సృష్టించింది. 183 వన్డేల్లో ఐదు శతకాలు, 49 అర్ధ శతకాలతో మిథాలీ 6,028 పరుగులు చేసింది. 1999లో భారత జట్టులో చోటు సంపాదించిన నాటినుంచి తన అసమాన ఆటతీరుతో ఆమె ఎన్నో మైలురాళ్లను అధిగమించింది. మిథాలీ స్ఫూర్తితోనే స్మృతిమంధాన, పూనమ్ కౌర్, దీప్తిశర్మ వంటి మహిళా క్రికెటర్లు మైదానంలోకి అడుగుపెట్టారు. పురుషుల, మహిళల క్రికెట్ మధ్య ఉన్న వ్యత్యాసానికి ఆమె వ్యాఖ్య చక్కని ఉదాహరణ, 'నాకు మరింత మద్దతే లభించి ఉంటే నా ఆట తీరు ఇంతకంటే ఎన్నో రెట్లు మెరుగ్గా ఉండేది' అని పేర్కొంది. ఈ మాటలు భారత్‌లో మహిళా క్రికెట్ పరిస్థితిని ప్రతిబింబిస్తాయి. ఇటువంటి అనుకూల స్థితిలోనూ ప్రపంచ కప్ పోటీల్లో ఫైనల్‌కు చేరుకోవడం గొప్ప విజయంగానే అభివర్ణించక తప్పదు. గేమ్ ఓడినా గ్రేట్ అనిపించుకున్నది. ప్రపంచవ్యాప్తంగా 50 మిలియన్ల మంది ప్రేక్షకులు ఈ ఆటను తిలకించారు. ఇప్పటివరకూ భారత్, ఇంగ్లాండ్ మధ్య జరిగిన ఈ హోరాహోరీ పోరును నేరుగా 26వేల మంది వీక్షించారు. 1983లో కపిల్‌దేవ్ సారథ్యంలోని జట్టు తొలి ప్రపంచకప్ ను అందుకున్న ఈ మైదానంలో జరిగిన మహిళా క్రికెట్ మ్యాచ్ మళ్ళీ అంతటి ఉత్కంఠను రేపింది. హైదరాబాద్‌లో ఆమెకు ఘనస్వాగతం లభించింది. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆమెకు రూ. 1కోటి నగదుపురస్కారం, బంజారా హిల్స్‌లో 600 గజాల స్థలాన్ని బహూకరించారు.

### మిథాలీ రనౌట్ వెనుక నిజం

అయితే తాజాగా మిథాలీ తన రనౌట్‌కు కారణాన్ని వెల్లడించింది. పరుగు కోసం యత్నిస్తున్న క్రమంలో బూట్లు మైదానంలో కూరుకుపోవడం వలనే తాను వేగంగా పరిగెత్తలేకపోయానని మిథాలీ వెల్లడించింది. 'బంతిని ఎదుర్కొన్న వెంటనే పూనమ్ పరుగు కోసం పిలిచింది. కానీ నా బూట్లు సహ కరించలేదు. అవి మైదానంలో కూరుకుపోయాయి. అందుకే వేగంగా కదలలేకపోయా. ఫలితం రనౌట్ అయి తీవ్ర నిరాశతో మైదానాన్ని వీడానని' ఆమె తెలిపింది. ఈ మ్యాచ్‌లో భారత్ 9 పరుగుల తేడాతో ఓడిపోయిన సంగతి తెలిసిందే. ఇదండీ మహిళా క్రికెటర్ల దీనగాథ.

**- బోస్**

# మాతృభూమి కోసం ప్రాణాలర్పించిన మౌలానా


**మౌలానా పీర్ అలీ ఖాన్ (1820-1857)**

8 'మాతృభూమి కోసం వ్యక్తి బలికావటం తన భూమి పట్ల ఆ వ్యక్తికి గల ప్రేమకు అది నిదర్శనం' అంటూ ఆంగ్లేయ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన మౌలానా పీర్ అలీఖాన్ 1820లో బీహార్ రాష్ట్రం అజీమాబాద్ జిల్లా మహమ్మద్‌పూర్‌లో జన్మించారు. తండ్రి మొహల్ అలీ ఖాన్. చిన్నవాడే జ్ఞానతృష్ణ తీర్చుకోవడానికి ఇల్లు వదలి వెళ్ళిన పీర్ అలీ అరబిక్, పర్షియన్, ఉర్దూ భాషలలో పాండిత్య సంపాదించి,చివరకు పాట్నా చేరుకుని పుస్తక విక్రేతగా స్థిరపడ్డారు. ఆంగ్లేయుల దురాగతాల పట్ల వ్యతిరేక ప్రదర్శించిన ఆయన ఆంగ్లేయ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న స్థానిక విప్లవమండలి సభ్యులయ్యారు. ఆంగ్ల ప్రభుత్వాధికారి మౌల్వీ మహదీకి నచ్చచెప్పి ఆయన ద్వారా సమకూర్చుకున్న ఆయుధాలతో మౌలానా పీర్ అలీ ఖాన్ దానాపూర్ ఆంగ్లేయ సైనిక స్థావరం మీద సాహసోపేత దాడిచేశారు. ఆ చర్యకు ఆగ్రహించిన బ్రిటిష్ సైనిక అధికారులు ఆయనకు, ఆయన విప్లవ మండలి సభ్యులు 43 మందిని, 1857 జూలై 4న అరెస్టు చేశారు. ఆంగ్ల ప్రభుత్వం మౌలానా బృందం మీద నడిపిన విచారణ 'పాట్నా కుట్రకేసు'గా చరిత్రలో నమోదయ్యింది. ఈ కేసులో మౌలానాకు, ఆయన అనుచరులు తొమ్మిది మందికి ఆంగ్ల అధికారి విలియం టేలర్ ఉరిశిక్షను ప్రకటించారు. ఆ సందర్భంగా విప్లవ మండలి సభ్యుల సమాచారం



రాబట్టేందుకు ఆయనను చిత్రహింసలకు గురిచేశారు. ఆయన శరీరం రక్తసిక్తంమై నోటమాట పెగల్లేదు. చివరకు 'ప్రతి ఒక్కరి జీవితంలో ఒక్కొక్కసారి ప్రాణాలను రక్షించుకోవడానికి తెలివిగా ప్రవర్తించాల్సిన అవసరం వస్తుంది. అయితే అన్ని సమయాలలో ప్రాణాలు కాపాడుకోవడమే ప్రధానం కాదు. కొన్ని సమయాలలో ఆశయాల కోసం, మాతృభూమి గౌరవప్రతిష్టల కోసం జీవితాలను పణంగా పెట్టాల్సి వస్తుంది. మాతృభూమి కోసం బలి కావటం తన భూమి పట్ల గల ప్రేమకు నిరద్శనం అవుతుంది... నా సహచరులను నాకళ్ళ ముందే ఉరి తీశారు. ఇంకా చాలా మందిని ఉరి తీయగలరు. నన్నూ చంపగలరు..... ఒక విషయం మాత్రం గుర్తుంచుకోండి. బలమైన స్వేఛ్ఛా కాంక్షతో,స్వాతంత్ర్యం కోసం రక్తతర్పణలకు సిద్ధమౌతున్న ఈ పుడమి తల్లి బిడ్డలను నిలువరించటం మీకు కాదు కదా, మరే శక్తికీ సాధ్యం కాదు. ఈ రణంలో చిందిన మా రక్తపు బిందువుల వలన స్వాతంత్ర్య సమరయోధుల శరీరాలలో అగ్ని పుడుతుంది. ఆ అగ్నిజ్వాలల వేడిమిలో మీ ప్రభుత్వం, మీరు మాడి మసైపోవటం తథ్యం,' అని బ్రిటిష్ పాలకుల భవిష్యత్తును ఎంతో ధైర్యంగా బదులిచ్చారు. మౌలనా పీర్ అలీ ఖాన్ చేతులు- కాళ్ళకు బిగుతైన బేడీలు వేశారు. చిత్రహింసలకు గురిచేసి పైశాచికానందం పొందారు. ఈ సంఘటన వివరాలను విలియం టేలర్ పూసకుచ్చినట్లుగా రికార్డులలో నమోదు చేశాడు. చివరకు మౌలానా పీర్ అలీ ఖాన్ మాత్రం ఉరివేదిక మీద నిలబడి చిరునవ్వులు చిందిస్తూ 1857 జూలై 7న ఉరితాడును ముద్దాడి మృత్యువును హుందాగా స్వాగతిస్తూ అమరులయ్యారు.

**(ముస్లిం స్వాతంత్ర్య సమరయోధులు ఆల్బమ్ 'చరితార్థులు' నుంచి....)**

**Syed Naseer Ahamed**

Mobile: 9440241727.

E-mail: naseerahamedsyed@gmail.com


# మన కోసం

| | | | |
|---|---|---|---|
| శ్రీ విజయలక్ష్మీ జనరల్ స్టోర్స్ | తుళ్ళూరు | చందోలు సత్యనారాయణ | 9441411432 |

**రెస్టారెంట్స్**

| | | | |
|---|---|---|---|
| బిర్యానిస్ | విజయవాడ | బిర్యానిస్ | 7032202222 |
| స్వాగత్ మెస్(వెజ్) | మల్కాపురం | చిగురుపాటి | 90329 58580 |
| ఎస్.ఆర్.కె. గ్రాండ్ | మందడం | శ్రీనివాస్ | 9553023388 |

**షాప్స్**

| | | | |
|---|---|---|---|
| రేమాండ్స్‌టైలర్స్ | తుళ్ళూరు | ఎస్.కె. జాని | 9492470426 |
| వర్షిత ఫోటోస్టాట్ | రాయపూడి | పోతురాజు | 9985853188 |
| బిస్మిల్లా పెయింటింగ్ వర్క్స్ | రాయపూడి | షేక్. మజీదు | 7095880828 |
| కె.జి .ఎన్. కారు ట్రావెల్స్ | రాయపూడి | ఎస్.కె.సుబాని | 97040 74820, |
| వైభవ్ డ్రస్సెస్ | తుళ్ళూరు | ఎస్‌వి. పున్నారావు | 9848407935 |
| చైతన్య గోదావరి బ్యాంకు | రాయపూడి | | 08645244266 |
| ఉంగరాల హుస్సేన్ టెంట్‌హౌస్ | రాయపూడి | ఉంగరాలఖాజ | 9441275466 |
| అంజుమన్ టెంట్ హౌస్ | రాయపూడి | పఠాన్ బాషా ఖాన్ | 9502085516 |

**ట్రేడర్స్**

| | | | |
|---|---|---|---|
| సాయి గణేష్ | వెలగపూడి | జొన్నలగడ్డ మనోజ్ కుమార్ | 7382371111 |
| శ్రీ చంద్రిక | రాయపూడి | కోలా శ్రీనివాసరావు | 908073516 |

**మ్యారేజీ లింగ్స్**

| | | |
|---|---|---|
| షేక్ జానీ | విజయవాడ | 9948450761 |

## ఆగస్ట్ 15న స్పోర్ట్స్ అకాడమీల ప్రారంభం

**అధికారులను ఆదేశించిన సీఎం చంద్రబాబు**

**రా.వా ప్రతినిధి- అమరావతి :** రాష్ట్రంలో స్పోర్ట్స్ అకాడమీల్ని ఆగస్ట్ 15న ప్రారంభించాలని సీఎం చంద్రబాటు అధికారుల్ని ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న 4 వాటర్ స్పోర్ట్స్ అకాడమీలనూ అదేరోజు ప్రారంభించాలన్నారు. క్రీడల అభివృద్ధి నైపుణ్యం శిక్షణాభివృద్ధి కార్పొరేషన్‌పై ఆయన సచివాలయంలోని తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. విశాఖ, కాకినాడ, గుడివాడ, నరసరావుపేట, నెల్లూరు, అనంతపురంల్లో స్పోర్ట్స్ అకాడమీల ఏర్పాటును సమీక్షించి వాటిలో షూటింగ్, అథ్లె టిక్స్, స్విమ్మింగ్, బ్యాడ్మింటన్, జూడో, తైక్వాండో, వెయిట్ లిఫ్టింగ్ తదితర క్రీడల్లో శిక్షణ ఇవ్వాలని సీఎం సూచించారు. వీటి నిర్వహణకు ఏడాదికి రూ.20 కోట్ల వ్యయమవుతుందని తెలిపారు. రాష్ట్రంలోని 16 వేల గ్రామాల్లోనూ ఆటస్థలాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## 23న నంద్యాల ఉప ఎన్నిక

**హైదరాబాద్ :** నంద్యాల అసెంబ్లీ ఉప ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది దాంతో పాటు గోవాలోని వాల్పాయ్, పానాజీ, ఢిల్లీలోని భావన (ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గాలకు కూడా ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల 29న విడుదలవుతుంది. ఆగష్టు 5వ తేదీ వరకు నామినేషన్లను దాఖలు చేయవచ్చు. 7వ తేదీన పరిశీలన జరుగుతంది. 9వ తేదీ వరకు ఉప సంహారణలకు గడువు ఉంటుంది. ఆగష్టు 23న పోలింగ్, 28న కౌంటింగ్ జరుగుతుంది. ఇప్పటికే నంద్యాలలో అధికార తెలుగుదేశం, ప్రతిపక్ష వైసీపీలు తమ తమ అభ్యర్థులను ప్రకటించాయి. గత ఎన్నికల్లో వైసీపీ బి ఫారమ్‌పై ఎమ్మెల్యేగా ఎన్నికైన భూమా నాగిరెడ్డి అనంతరం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఇటీవలే ఆయన కన్నుమూశారు. దీంతో అక్కడ ఉప ఎన్నిక జరుగుతోంది.

# రద్దు కరెన్సీ లెక్క తేల్చండి

### ఆర్బీఐని నిలదీసిన ప్రతిపక్షాలు

**న్యూఢిల్లీ :** కేంద్రం రద్దు చేసిన నోట్లల్లో ఎంత మొత్తం బ్యాంకులకు చేరాయో భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) ఎందుకు ప్రకటించడంలేదో తెలపాలని రాజ్యసభలో ప్రతిపక్షాలు డిమాండు చేశారు. 500, వెయ్యి రూపాయల నోట్లను రద్దు చేసి తొమ్మిది నెలల కాలం గడిచినప్పటికీ రద్దు నోట్లు లెక్క తేలలేదని సభ జీరో అవర్‌లో ఆనంద్ శర్మ (కాంగ్రెస్) ఈ అంశాన్ని లేవనెత్తుతూ "బిడ్డ తొమ్మిది నెలల్లో పుడుతుందని తెలుసు" కాని పాత రద్దు కరెన్సీ లెక్కను తెలుసుకో లేకపోతున్నామని అన్నారు. నల్లధనం దొంగనోట్లను ఏరివేసే క్రమంలో గతేడాది నవంబరు 8న రూ.500 వెయ్యి నోట్ల రద్దు చేస్తున్నామని కేంద్రం ప్రకటించింది. ఆ తరువాత కొత్త రూ. 500, నోట్లను ప్రవేశపెట్టింది. "చంద్ర,అంద్ర అంగారక గ్రహాల వద్దకు వెళ్తాం డిజిటల్ ఇండియా గురించి మాట్లాడతాం కానీ మనం డబ్బును లెక్కపెట్టలేం" అని ఆనంద్ శర్మ అన్నారు ఇతర ప్రతిపక్ష పార్టీలు ఆనంద్ శర్మకు మద్దతుగా నిలిచాయి. " కరెన్సీ నోట్లను లెక్కపెట్టేందుకు నేను ఆర్బీఐకి వెళ్లలేను" అని శర్మ అన్నారు. దిగ్భ్రాంతి కలిగించే నోట్ల రద్దు నిర్ణయం తీసుకున్న తరువాత ప్రభుత్వం రద్దు నోట్లను బ్యాంకు ఖాతాలో జమచేసేందుకు లేదా వాటికి బదులుగా కొత్త నోట్లను తీసుకునేందుకు ప్రభుత్వం వివిధ కేటగిరీల ప్రజల కోసం వివిధ తేదీలను ప్రకటించింది.

# బొకే వర్సెస్ బుక్!

### కోడలు పిల్లా.కామ్

కాఫీ తాగుతూ తనలో తానే నవ్వుకుంటోంది సీత.

అది గమనించిన అత్తగారు "ఏంటో కోడలుపిల్ల తెగ నవ్వేస్తోంది" అంది పక్కనున్న కొడుకు గణేష్‌నుద్దేశించి.

"ఎప్పుడూ టీవీలో మునిగిపోయి వుండే నువ్వు ఇపుడు చూడ్డంలేదని హా(ఆ)శ్చర్యంతో కూడిన, ఆనందంతో నిండిన నవ్వయివుంటుంది" అన్నాడు గణేష్.

"ఇదిగో, సినిమా డైలాగులన్నీ వల్లిస్తూ మా అత్తాకోడళ్ళమధ్య లేనిపోని ఫిట్టింగులు పెట్టకు.." అని, అత్తగారివైపు తిరిగి "మీ గురించి ఏదైనా వుంటే మీతోనే అంటా కానీ వెక్కిరింతగా నవుతానా అత్తయ్యా మీరే చెప్పండి?!" అంది సీత.

"అబ్బ, ఏదో జోక్ చేశాలే.. ఇంతకీ ఎందుకు నవ్వుతున్నావ్?" అన్నాడు గణేష్.

"ప్రధాని మోదీ ఫ్లవర్ బొకేలకు బదులు పుస్తకాలిమ్మన్నారు కదా!"

"పాపం.. అందులో తప్పేముంది నవ్వడానికి? మంచిమాటేగా.." అంది సుమిత్ర.

"మంచి మాటే. వందలు వందలు తగలేసి పూలగుత్తులెందుకిస్తారో.. అందుకున్న రెండో క్షణం అవతలికిసిరేస్తారు.. ఉత్తినే నలిగిపోతాయని మనం కూడా బోల్డన్నిసార్లు బాధపడ్డాం" అంది సీత.

"ఓహో ఎలాంటి పుస్తకాలిస్తారనా?" అన్నాడు గణేష్.

"అది తల్చుకుంటేనే నవ్వొస్తోంది. మార్కెట్లో లక్షలకొద్దీ పుస్తకాలుంటాయి.. కానీ, చదివే అలవాటున్నవాళ్ళెంతమంది? ఎవరికి ఎలాంటి పుస్తకం ఇవ్వాలోనెందరికి తెలుస్తుంది? మోదీగారికి తీసికెళ్ళి పసలేని కవితా సంకలనాలో, కథల పుస్తకాలో, కాలక్షేపపు వ్యాస సంపుటాలో ఇస్తే ఎలా వుంటుంది?" అంటూ పకపకా నవ్వింది సీత.

ఆ ద ృశ్యం ఊహించుకుని తల్లీకొడుకులు కూడా నవ్వేశారు.

"చూశారా, మీక్కూడా నవ్వొస్తోంది.. ప్రపంచంలో చదివే అలవాటును తలదన్నేదింకోటి లేదు. నిజమే కానీ.. ఏం చదువుతున్నారనేది కూడా చాలా చాలా ముఖ్యం. స్కూళ్ళూ కాలేజీల్లో టెక్స్‌ట్ బుక్స్ సంగతి అలా వుంచితే ప్రపంచంలో ఎక్కువమంది చదివేది న్యూస్‌పేపర్ మాత్రమే. ఆనక కథలు, నవలలు లాంటి సాహిత్యాన్ని ఇష్టమపడే మనబోటివాళ్ళు కొంచెం ఎక్కువమందే ఉంటారు. ఇక తమ ఫీల్డుకి సంబంధించిన బుక్స్, చారిత్రక పుస్తకాలు, జంతు, వృక్ష, భూగోళ, ఖగోళ లాంటి శాస్త్రీయ విషయాలు ఇష్టపడేవారు – ఇలా ఎవరి అభిరుచి ఏంటో, ఎలాంటి పుస్తకాలు నచ్చుతాయో ఎవరు చెప్పగలరు?!" అంది సీత.

"నిజమే! సాహిత్యం మాత్రం అంతా ఒకలా వుంటుందా? కథ, నవల, కవిత్వం, నాటకం.. ఎన్ని ప్రక్రియలున్నాయి? వాటిల్లో మళ్ళీ డెప్తున్నవి, లైటర్‌వెయిన్లో నడిచేవి.." అన్నాడు గణేష్.

"మనింట్లోనే ఒక్కొక్కరిదీ ఒక్కో టేస్టు.." అంది సీత.

"నేనేమో టాల్‌స్టాయ్, హెమింగ్వే లాంటి ఇన్‌డెప్త్ ఉన్న రైటింగ్స్ చదివితే నువ్వేమో అటుకులు, మురమరాల్లాంటి టైంపాస్ కథలూ కాకరకాయలూ చదువుతావ్" అన్నాడు గణేష్.

"ఒయబ్బో, నీకంటే ఎక్కువే చదివా.. మపాసా దగ్గర్నుంచీ మహాశ్వేతాదేవి వరకూ సీరియస్ రచనలు లెక్కలేనన్ని చదివాను. ఎనర్జీకి బ్రెప్టిన్ బిస్కెట్లు తిన్నా, కాలక్షేపానికి మామూలు చిరుతిళ్ళు తినమేంటి?!" అంది సీత.

"ఇద్దరూ చదివార్లెద్దూ.. ఇంతకీ ఎవరికి ఎలాంటి పుస్తకం ఇవ్వాలో ఎంచి ఇవ్వాలి.. అంతేగా" అంది సుమిత్ర.

"అదంత తేలికా అత్తయ్యా? మన క్లోజ్ ఫ్రెండ్సో, దగ్గరగా చూసిన చుట్టాల్లో అయితే వాళ్ళ టేస్టేంటో తెలుసు కనుక మనం మంచి పుస్తకం అని ఫీలయ్యేది, వాళ్ళకూ నచ్చుతుంది అనుకున్నది ఇవ్వొచ్చు. అప్పుడు కూడా మనమిచ్చే బుక్ వాళ్ళకు నచ్చుతుందని గ్యారంటీ లేదు"



అంది సీత.

"నిజమే, ఆలోచనలూ అభిరుచులూ అంత తేలిగ్గా కలవ్వు" అంది సుమిత్ర.

"అలాంటిది ఏ బీరకాయ పీచు చుట్టరికంతోనో వెళ్ళే పెళ్ళిళ్ళు, ఆఫీసుల్లో కొలీగుల ఫంక్షన్లకు మాంఛి గిఫ్టు ఇస్తున్నామని ఫీలైపోతూ ఏదో బుక్ ప్రెజెంట్ చేస్తే తెలుగు సరిపోక హిందీ ఇంగ్లీషుల్లో కూడా తిట్టేసుకోగలరు" అంది సీత.

"ఆ లెక్కన మన ప్రధానిగారికి ఏ పుస్తకాలు నచ్చుతాయో ఎలా చెప్పగలం? ఆనయ పీఆర్వోనడిగి ఇస్తే సరి"

"మొత్తానికిప్పుడు మోదీగారి నివాసం దగ్గర అర్జంటుగా బుక్‌స్టాల్స్ వెలుస్తాయేమో" అంటూ గణేష్ నవ్వేశాడు.

"బొకే వర్సెస్ బుక్" అంటూ సీత కూడా నవ్వింది.

# ఆహార మార్పులతో కామెర్లు నివారణ

**హెపటైటిస్ బి :** దీన్ని పచ్చకామెర్ల వ్యాధి అంటారు. ఇది ప్రపంచాన్ని గడగడలాడిస్తోంది. దీన్ని ముందుగా కనిపెట్టటం కష్టం. మనం జాగ్రత్తపడి, చికిత్స తీసుకునే వ్యవధి కూడా వుండదు. ఇది మన శరీరంలో చాలా కాలంగా నిశ్శబ్దంగా వుండి ఒక్కసారి బయటపడుతుంది.

**ఇది రెండు రకాలు :** 1) హెపటైటిస్, ఇది మామూలు కామెర్లు 2) హెపటైటిస్ బి. దీనికి ఎయిడ్స్ (హెచ్ఐవీ) కారణం అయితే ఈ హెపటైటిస్ బి కి (హెచ్‌బివి) వైరస్ కారణం అవుతుంది. మామూలు కామెర్లకు చేసినంత సులభంగా ఈ హెపటైటిస్ బికి వైద్యం చేయటం కష్టం. చాలా మంది అవగాహనా లోపంతో పసర్లు వాడటం, వాతలు చేయించుకోవటం చేస్తూ వుంటారు. ఇది మరీ పీకల మీదకు తెచ్చుకోవటమే అవుతుంది.

మామూలు కామెర్లకు ఆహారంలో మార్పులు తీసుకుంటూ, విశ్రాంతి తీసుకుని మందులు వాడితే వ్యాధి తగ్గుతుంది. కానీ ఇది (హెపటైటిస్ బి) అలా కాదు. వచ్చాక మనం దీన్ని ఏమి చేయలేం. నివారించటానికి అవకాశాలు వున్నాయి.




**కేన్సర్ :** ఈ క్యాన్సర్ వ్యాధిలో 100 రకాలు ఉన్నాయంటే ఆశ్చర్యంగా వుంది కదూ! దీన్ని మొదటి దశలోనే గుర్తించినట్లయితే నివారించటం సులభం అవుతుంది. శరీరంలో పెరిగే అనవసరమైన పెరుగుదలనే కేన్సర్ అంటారు. మన శరీరంలో కణాల ఎదుగుదల ఎంతవరకూ వుండాలో అంతవరకూ తయారు చేయడం మన శరీరంలో వుండే ప్రోటీన్ల కర్తవ్యం. అయితే కొన్ని ప్రోటీన్ల లోపం వల్ల కూడా ఈ పని సరిగ్గా జరగక కణ విభజన విపరీతంగా జరిగి కొత్త కణాలు పుట్టుకొస్తాయి. దీనినే కేన్సర్ అంటారు.

ఇందులో కొన్ని ముఖ్యమైనవి : 1) రొమ్ము క్యాన్సర్, 2) ఊపిరితిత్తులు 3) అన్న వాహిక, 4) మెదడు, 5) అండాశయం, 4) గర్భకోశం, ఎముకల్లో ఎక్కువగా రావటానికి అవకాశం వుంది.

వీటిని మొదటిదశలో గుర్తించినట్టయితే రేడియోథెరపీ,కీమోథెరపి ఆపరేషన్ ద్వారా నయం చేయవచ్చు కానీ క్యాన్సర్‌కు గురయ్యే ముందు శరీరంలో వచ్చే మార్పులు గుర్తించాలి. ఈ క్యాన్సర్‌ను బయాప్సి పరీక్ష ద్వారా (పాథాలజిస్టు) రోగ నిర్ధారణ చేస్తారు.

**గుర్తించే విధానం**

1) మల, మూత్ర విసర్జనలో రక్తం పడటం, 2) పుండ్లు, కురుపులు మానకుండా , 3) అసాధారణంగా రక్తస్రావం , 4) రొమ్ములో గడ్డలు, కంతులు , 5) ఎక్కువకాలం అజీర్ణం, ఆకలి మందగించడం, మింగుతున్నపుడు నొప్పి, 6) చాలాకాలంగా దగ్గు రావటం, బరువు తగ్గిపోవటం, 7) గుండెల్లో నొప్పి, దగ్గినపుడు రక్తం పడటం, 8) అకారణంగా ఎముకలు విరిగిపోవటం, 9) బహిష్టు ఆగిపోయిన స్త్రీలలో రక్త స్రావం జరగటం, 10) శరీర భాగాల్లో ఎక్కువగా (చంకల్లో, గజ్జల్లో, మెడ దగ్గర) కంతులు రావటం దీని లక్షణం.

మనం నిత్య జీవితంలో ఎన్నో రకాల ఆందోళనలు, ఒత్తిళ్ళకు గురవుతూ వుంటాం. కానీ పైన వివరించిన ఏ మార్పు శరీరంలో సంభవించినా వెంటనే అశ్రద్ధ చేయకుండా వైద్య సలహాలు పాటించటం చాలా మంచిది.

**కారణాలు :** దురలవాట్లు, పొగాకు నమలటం, సిగరెంట్లు, చుట్ట, అడ్డ పొగ చాలా ప్రమాదకరమైనవి. మద్యం ఎక్కువగా తీసుకోవటం, అపరిశుభ్రమైన వాతావరణం, ఆహారపు అలవాట్లు (జీర్ణం కాని ఆహారం) కారణాలవుతాయి.

## దుర్యోధనుడు & రాహుల్ గాంధీ... ఇద్దరికీ

టేలెంట్ లేదు. అయినా కూడా,
వంశపారంపర్యంగా అధికారాన్ని
చేజిక్కించుకున్నారు.
భీష్మ & అద్వానీ..... ఇద్దరికీ కిరీటం
దక్కలేదు. గౌరవం దక్కింది.
కానీ జీవిత చరమాంకంలో నిస్సహాయులుగా
మిగిలి పోయారు.

అర్జునుడు & నరేంద్రమోదీ.. ఇద్దరూ
నైపుణ్య కలిగి,దర్మం పక్క నిలబడటం
వల్ల, అందలమెక్కొనవారే.. కానీ
ధర్మాన్ని పాటించడమెంత కష్టతరమో
జ్ఞానోదయమయింది ఇద్దరికీ.

కర్ణ & మన్మోహన్ సింగ్... ఇద్దరూ తెలివైన
వాళ్లే. కానీ, అదర్మం వైపు వుండటం వల్ల
అధికారన్నెప్పుడూ అనుభవించకపోయారు.

అభిమన్యుడు& కేజ్రివాల్... ఇద్దరూ
యుద్ధానికి కొత్తవారే.
శత్రువులు పన్నిన చక్రవ్యూహం నుండి
బయటపడలేకపోయారు.

శఖుని& దిగ్విజయ్ సింగ్...
ధర్మాధర్మాలను తుంగలోకి నెట్టి,
అడ్డదారుల్లోనైనా సరే,
తమ లీడర్స్‌ని అధికారంలో
చూడానుకున్నవారే

ధృతరాష్ట్రుడు & సోనియా... తమ సంతతి
మీద విపరీత ప్రేమాభిమానాలతో,
గుడ్డివారిగా మిగిలిపోయారు.

చివరిగా....
కృష్ణుడు& అబ్దుల్ కలాం.....వీళ్లంటే
అందరికీ ఆదరాభిమానాలే.ఆరాద్య దైవాలే.
కానీ వీరు చెప్పిన నీతులూ ప్రవచనాలు....
ఎవరూ పాటించరు

That is MAHABHARAT
AND THIS IS BHARAT....

# ఆహారంలోనూ కక్కుర్తేనా?

మనుషులనేవారు తినడానికి వీలులేవి తిండిని రైళ్లలో సమకురుస్తున్నారని రెండురోజుల క్రితం కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ( కాగ్) తీవ్రంగా దుయ్యబట్టింది. రైళ్లలో సరఫరాచేస్తున్న విషతుల్యమైన, రీసైక్లింగ్ ఆహార పదార్థాలను విధిలేని పరిస్థితుల్లో ప్రయాణికులు కొనుగోలు చేస్తున్నారని కాగ్ వ్యాఖ్యానించింది. బయట మార్కెట్‌లో కంటే ఎక్కువ ధరకు అదీ తినడానికి కూడా వీల్లేని ఆహార పదార్థాలను సరఫరా చేయడం, అది తెలిసీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు మౌనం పాటించడం ఎంత దౌర్భాగ్య పరిస్థితిలో మనం బతుకుతున్నామో స్పష్టమవుతోంది. కనీసం వాటర్ బాటిల్ కూడా ఎంఆర్‌కంటే ఎక్కువ ధరకే అమ్ముతున్నారు. దేనికీ బిల్లు ఉండదు వీటికి తోడు రైళ్లలో అనధికార వెండర్ల సంగతి చెప్పనే అక్కర్లేదు. దేశవ్యాప్తంగా దాదాపు 75 రైల్వే స్టేషన్లు 80 రైళ్లలో పరిస్థితుల్ని రైల్వే

**రైల్వేకు తలంటిన 'కాగ్'**

అధికారులతో పాటు కాగ్ బృందం కూడా పరిశీలించి రైల్వేలకు గట్టిగా తలంటింది. తాము పరిశీలించిన రైల్వే స్టేషన్లలోని క్యాంటీన్ల పరిసర ప్రాంతాలో అసలు పరిశుభ్రతే కొరవడిందని కాగ్ చెప్పిన మాట తరచుగా ప్రయాణించే ప్రయాణికులకు అనుభవైకమే! పేదవాడికి అత్యంత కీలక ప్రయాణసాధనం రైలు. ఆ రైళ్లలో పరిశుభ్రత కోసం ఆశించడం నేతిబీర కాయలో నెయ్యి కోసం వెతకడం లాంటిదే!

ఉదాహరణకు విజయవాడ-సికింద్రాబాద్ వెళ్లే రైలు కంపార్టుమెంట్లను పరిశీలిస్తే ఇందులో ఎంత నిజం దాగుందో వెల్లడవుతుంది ప్రయాణికులు తినిపారేసిన పదార్థాల అవశేషాలతో ప్రతి కంపార్టుమెంట్ నిండివుంటుంది. రైలు గమ్యానికి చేరుకున్న తరువాత కంపార్టుమెంట్‌ను శుభ్రం చేయాలి. అలాకాకుండా అపరిశుభ్ర కంపార్టుమెంట్లతోనే నడుపుతున్నారంటే ప్రయాణికులంటే రైల్వే శాఖకు ఎంత నిర్లక్ష్యమో తెలుస్తోంది. ప్రధాని నరేంద్ర మోడీ మానసపుత్రికగా చెప్పుకునే స్వచ్ భారత్ ఎక్కుడికి పోయిందో ఏమోమరి? దీనికి రైల్వే శాఖ ఏమి జవాబు చెబుతుందో చూడాలి. ఎన్ని బులెట్ రైలు ్లయ ఎంతవేగవంతమైన రైళ్లను చూస్తే తెలుస్తుంది. ఎంతో నమ్మకంతో ప్రయాణం చేసే ప్రయాణికులు భద్రత, పరిశుభ్రత, నాణ్యమైన ఆహారం తదితరమైన వాటికి అందించాలనే ప్రతి ప్రయాణికుడు కోరుకుంటాడు. అంతేగానీ, అత్యంత ఖరీదైన వసతుల్ని ఎవరూ ఆశించరు. ఎందుకంటే మామూలు సదుపాయాలే లేని చోట ఉన్నత ప్రమాణాలతో కూడిన సౌకర్యాలను ఎవరు ఆశిస్తారు. కొనుక్కునేందుకు సిద్ధపంగా ఉన్న ప్రయాణికులకు నాణ్యమైన ఆహారపదార్థాలను అందించకుండబా ప్యాకెట్లో సిద్ధం చేసిన వాసనత ఉండే పదార్థాలను సరఫరా చేయడం ఏ మేరకు మానవత్వం అనిపించుకుంటుందో అధికారులు, క్యాంటీన్ నిర్వాహకులే చెప్పాలి.

# గోమూకల దాడులపై చర్చించాలి

## లోక్‌సభలో విపక్షాల పట్టు

**న్యూఢిల్లీ :** లోక్‌సభలో కాంగ్రెస్ సభ్యులు గందర గోళం స్పష్టించడంతో సభ వాయిదా పడింది. తమ ఆరుగురి సభ్యుల సస్పెన్షన్ ఎత్తివేయాలని నాయుకుడు జ్యోతిరాదిత్య సింధియాపై బీజేపీ ఎంపీలు చేసిన వ్యాఖ్యలతో సహా అనేక అంశాలపై కాంగ్రెస్ సభ్యులు ఆందోళన చేయడంతో ఎటువంటి చర్చ జరగకుండానే సభ వాయిదా పడింది. గోరక్షణ పేరుతో దేశంలో హత్యా ఘటనలపై చర్చించాలని కూడా కాంగ్రెస్ ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. సింధియా మాట్లాడుతూ దళిత సామాజిక వర్గానికి సంబంధించి బీజేపీ ఎంపీ వీరేంద్ర కమార్,నంద కుమార్ సింగ్ చౌహాన్‌లు తనపై చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. వారి చేసిన వ్యాఖ్యలు వాస్తవమైతే సభ సభ్యత్వానికి రాజీనామా చేస్తానని పేర్కొన్నారు. ఆరోపణలను నిరూపించడంలో బీజేపీ నాయుకులు విఫలమైనట్లయితే వారు తమ పదవులకు రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నాయుకుడు మల్లికార్జున ఖార్గే మాట్లాడుతూ ' నా ప్రతిష్టకు భంగం కలిగింది' అని అన్నారు. సింధూయాను సమర్థిస్తూ గత 15 ఏళ్లకుపైగా సభలో దళితుల సమస్యలపై గుణ ఎంపీ పోరటం చేస్తున్నారని తెలిపారు. సింధూయాతో సహా కాంగ్రెస్ సభ్యులు కాంతిలాల్ భూరియా కె.సి.వేణుగోపాల్, రవనీత్ సింగ్ బిట్టూలు పోడియంలోకి దూసుకువచ్చారు. సభ్యులు వారివారి స్థానాల్లో నిల్చొని ఆందోళన చేయడంతో సభలో గందరగోళానికి దారితీసింది దీంతో మహాజన్ మాట్లాడుతూ అధికారులకు లేదా ప్రధాన కార్యదర్శికి హాని కలిగినట్లయితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని కలిగినట్లయితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సభలో గందరగోళ పరిస్థితిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీరు ఆందోళన ఆపకపోతే, సభ ఎలా నడుస్తుంది. నిబంధనల ప్రకారం మాట్లాడాలని మీకు చెప్పాను. సభ ఎలా నడనాలో మీరు నాకు చెప్పవద్దు' అని అన్నారు. ఖార్గే మాట్లాడుతూ సభ నడవాలని ప్రతిపక్షం కూడా కోరుకుంటోందన్నారు. అయితే పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత కుమార్ 'అగ్నికి ఆజ్యం పోసేందుకు' ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అటుతర్వాత స్పీరక్ సభను వాయిదా వేశారు. తిరిగి 3 గంటలకు సభ సమావేళమైన వెంటనే స్పీకర్ ఆపత్రాలను తన ముందు ఉంచవల్సిందిగా ఆదేశించింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ( సవరణ) బిల్లు- 2017ను స్పీకర్ చేపట్టిన వెంటనే సభలో గందరగోళం ప్రారంభమైందిగా ఆమోదం కోసం బాల్లును పరిశీలించాల్సిందిగా కేంద్ర మనవ వనరుల శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ బిల్లును ప్రవేశపెట్టారు. అంతకుమందు, భారత 14వ రాష్ట్ర పతిగా రామ్‌నాథ్ బిల్లును ప్రవేశపెట్టారు. అంతకుముందు, భారత 14వ రాష్ట్ర పతిగా రామ్‌నాథ్ కోవింద్ ప్రమాణ స్వీకారకార్యక్రమంలో పాల్గొనేందుకు సభ్యులను అనుమతించిన తర్వాత ఉదయం 11 గంటలకు సభ సమావేశమైన కొన్ని నిముషాలకే సభ మధ్యాహ్నం 3 గంటల వరకు వాయిదా పడింది.

## ప్రతిభారత్న, సేవారత్న పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

**రా.వా.ప్రతినిధి- విజయవాడ :** ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమి ప్రతి ఏడాది నిర్వహించే భారత విశిష్ట ప్రతిభారత్న, సేవారత్న జాతీయస్థాయి పురస్కా రాల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అకాడమి ఫౌండర్ ప్రెసిడెంట్ ఈ.వి.వి.నారాయణ మాస్టార్ ఒక ప్రకటనలో తెలిపారు. పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం ఆగస్టు 18న న్యూఢిల్లీలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాహిత్యం, సంగీతం, నృత్యం,విధ్య, వైద్యం, కళలు, క్రీడలు, యోగ, పర్యావరణ పరిరక్షణ లాంటి రంగాల్లో ప్రతిభావంతులైన, సేవలందిస్తున్న వారు పురస్కారాల ఎంపికకు దరఖాస్తులు పంపాలన్నారు. వారి ప్రతిభను తెలియజేసే సర్టిఫికెట్స్ ఫోటోలు, పత్రికల క్లిప్పింగ్స్ జిరాక్స్ కాపీలతో 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను దరఖాస్తుకు జతచేయాలన్నారు దరఖాస్తులు అకాడమి కార్యాలయానికి చేరడానికి ఆగస్టు 5 ఆఖరి తేదీ అన్నారు. దరఖాస్తులు పంపేందుకు, వివరాలకు నెం 96523 47207ను సంప్రదించాలి.



శ్రీ కల్కి అందరివారు
విశ్వశాంతి ధర్మ స్థాపకులు,దైవ సత్యస్వరూపి,
ఎం.బేగ్
లోక రక్షకులు జగద్గురువులు శ్రీ కల్కి
కలియుగ కాల ప్రమాణము 4,32000 సంవత్సరాలు
3658 వ సం॥క్రీ॥ శ॥ 570 సం॥లో వచ్చారు. శ్రీ కల్కి
అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారు
కలియుగము మహా మంత్రమునకు సామ వేదములో
హా హా 1 లా ఇలాహా
హూ హూ 2 ఇల్లల్లాహు
హీ హీ 3 మొహమ్మదుర్ రసూలుల్లాహి
8143307812
ఎవరూ నరకానికి పోకుండా స్వర్గానికి వెళ్లాలనే ఆకాంక్షిస్తూ..

# కలుగుల్లో చిత్రపరిశ్రమ పెద్దలు

## హెచ్చరిస్తున్న అధికారులు, చోద్యం చూస్తున్న వ్యాపారవర్గాలు

















యువతను నిర్వీర్యం చేసి, దేశభవిశ్యత్‌కు ఆధారమైన పిల్లలకు సైతం చాక్లెట్లు, బిస్కెట్లలో డ్రగ్స్ సరఫరాచేస్తూ సమాజాన్ని అస్తవ్యస్థం చేస్తున్న అసలైన మాదకద్రవ్యాల ముఠాను పట్టుకొని అంకుశం సినిమాలో విలన్ రామిరెడ్డినిలా చార్మినార్ చౌరస్తాలో తన్నుకుంటూ తీసుకురండి..అకున్ సబర్వాల్ సార్ అంటున్నారు నగరవాసులు.

తెలుగు రాష్ట్రాలను కుదిపేస్తున్న విషయం ఎక్సైజ్ అధికారులు చిత్రపరిశ్రమకు చెందిన కొంతమందిని మాదక ద్రవ్యాలకేసులో విచారించడం. తెలంగాణరాష్ట్రంలో జరుగుతున్నదే అయినప్పటికీ వారంతా సినిమా పరిశ్రమకు చెందినవారు కావడం, ఎలక్ట్రానిక్ మీడియా మరీ ఉత్సుకతతో ప్రసారం చేసి వద్దనుకున్నా జనం మెదళ్లలోకి మాదకద్రవ్యాల(డ్రగ్స్)కేసును ప్రవేశపెడుతున్నారు. నిజానికి మెట్రోసంస్కృతిలో ఇదొక భాగం, పబ్‌లు, క్లబ్‌లు, 24 గంటల హోటళ్లకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం, అధికారులు ఇలాంటివి జరగవని ఎలా అనుకున్నారు ? మొదటి నుంచి ఈ కేసుల నివారణకు అధికారులు తీసుకున్న ముందు జాగ్రత్త చర్యలేవని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ డ్రగ్స్ కేసులో 40 మంది పేర్లు వెల్లడించాల్సి ఉండగా, కేవలం 12 మంది పేర్లను మాత్రమే అధికారులు ప్రకటించారు .

**పిల్లలు సరే .. సినిమావాళ్లే డ్రగ్ ఎడిక్టిలా ?**

మొదటిరోజే సిట్ ముందు హాజరైన దర్శకుడు పూరీ జగన్నాథ్ పెద్దల పేర్లు చెబితే మీరు వారిని అరెస్టు చేయగలరా అని సవాల్ చేసినట్లు తెలుస్తోంది. రెండో రోజు హాజరైన శ్యాంనాయుడు అసలు డ్రగ్స్ అంటే ఏంటంటూ ప్రశ్నించి సిట్ అధికారులకే తలనెప్పి తెప్పించి త్వరగా జారుకున్నాడని, మూడోరోజు హజరైన సుబ్బరాజు , తరుణ్ ఆపై నవదీప్ అన్నివివరాలు అందించినట్టు సమాచారం లీకయింది.దాని ప్రకారం కూడా అరెస్టులు, హాజరు కావాలన్న నోటీసులు పంపామన్న వార్తలు రావడం లేదు. రక్త,వెంట్రుకలు, గోళ్ల పరీక్షలపై నిర్భందానికి తావులేదన్న హైకోర్టు ఆదేశాల మేరకు సినీనటి చార్మికి ఊరట కలిగింది. ఇదే సమయంలో సమయపాలన విషయం కూడా కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు మాత్రమే విచారించారు. మరో నటి, ముమైత్‌ఖాన్ గురువారం బిగ్‌బాస్ రియల్టీషోనుంచి సరాసరి విచారణా అధికారులవద్దకు చేరుకుంది. పరీక్షకు గోళ్లు, వెంట్రుకలు, రక్తనమూన ఇవ్వడానికి ఆమెకూడా నిరాకరించారు.

దబ్బుఎక్కువై సరదాలు చేసుకునే అధికారుల, పారిశ్రామిక, రాజకీయవేత్తల పుత్రరత్నాలు చాలామందే ఉన్నారు. అయితే ఇంతవరకు వారి గురించి ఒక్క విషయం కూడా ముందుకు రాలేదు సరికదా. . సినిమారంగంలో గాడ్‌ఫాదర్స్ లేని వారిని ఒక దర్శకుడి నటులను మాత్రమే విచారణలకు పిలిచారని ప్రజలు విశ్లేషించుకుంటున్నారు. ఈ పరిశ్రమలో తరతరాల నుంచి వెలిగిపోతున్న పెద్దలందరికీ బార్లు, పబ్‌లు ఉన్నాయి, అదీ రాజకీయనాయకుల భాగస్వామ్యంతో ... ఈ విషయం ఎక్సైజ్ , నిఘా అధికారులకు, రాజకీయనాయకులకు ఇంకా సీనియర్ జర్నలిస్టులకు తెలిసిందే.

గత వారం రోజులుగా చిత్రపరిశ్రమకు చెందిన ప్రముఖులు కూడా దీనిలో ఉన్నట్లు చెబుతున్నారు తప్ప వారెవరు అని చెప్పడానికి లేదా విచారించగా వెల్లడైన పేర్లను చెప్పడానికి అధికారులు కూడా జంకుతున్నారన్నది నిజం.. డ్రగ్స్‌కేసు విషయంతో తెలిసిందేమంటే తెలుగు హీరోలు ప్రజలకే కాదు (ప్రత్యేకహోదా కోసం ఎవరూ పెదవివిప్పలేదు) .. కనీసం చిత్రపరిశ్రమలోని వ్యక్తులకు కూడా మోరల్ సపోర్టు ఇవ్వడంలేదు. కేవలం వారి ఆస్తులు పెంచుకోవడం, వారసులను హీరోలను చేయడం తప్ప దేనికీ పనికిరావడం లేదన్నది స్పష్టమవుతోంది.

క్షణంక్షణం మారుతున్న పరిస్థితులకు సామాన్య ప్రజానీకమే అభద్రతాభావానికి గురవుతున్న నేటి కాలంలో రాజకీయ,వ్యాపార, చిత్రపరిశ్రమలోని వారు మరెంతమందో వాటిని వాడి ఉండవచ్చు. అయితే మాదకద్రవ్యాలను సరఫరాచేసేవాళ్లను పట్టుకొని నగరాన్ని డ్రగ్స్ ఫ్రీగా చేయకుండా కాలయాపన చేయడం సరికాదు. వారానికి ఒక నైజీరియన్‌ను పట్టుకొని వారి నుంచి డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుంటుంటే ఎక్సైజ్‌శాఖకు సరైన గుర్తింపు రాని కారణంగా ఇలాంటి విచారణలు చేపట్టారని నెటిజన్లు సెటైర్లు వేస్తుండగా, తెలంగాణ ప్రజల్లో కేసీఆర్ ప్రభుత్వంపై అసంతృప్తి రగులుతోందని దాన్నుంచి మళ్లించడానికే ఇలాంటి విచారణలు జరుపుతున్నారని ప్రతిపక్షాలు మండి పడు తున్నాయి. చిత్రపరిశ్రమలో కొందరిని కావాలనే కేసుల్లో ఇరికించారని తోటి పరిశ్రమ వ్యక్తులపై అనుమానం చేస్తున్న వారు కూడా ఉన్నారు. రాష్ట్రంలోని చిత్రపరిశ్రమ పెద్దలంతా అధికారపార్టీలతో కలిసి,మెలసి ఉంటారని రాజకీయాలకు దూరంగా ఉండే వారినే అధికారులు టార్గెట్ చేసుకున్నారన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి.

చిత్రపరిశ్రమలోని పెద్దలంతా ఎక్కడి దొంగలు అక్కడే గప్‌చుప్ సాంబార్ బుడ్డి అంటూ ఎవరి కలుగుల్లో వారు దూరిపోయారు. మూవీ అసోసియేషన్ 'మా' అధ్యక్ష, కార్యదర్శులు నోరు మెదపడంలేదు. చార్మి సోమవారం హైకోర్టు గడపతొక్కింది. తన ప్రాథమిక హక్కులకు భంగం కలిగించవద్దని కోరింది. నిజమే విచారణలో ఉన్న ప్రతిఒక్కరూ దోషికాదుకదా.. నిరూపణ అయితేనే నేరస్తుడు అవుతారు. అంతవరకు వారి హక్కులను పరిరక్షించాల్సి ఉంటుంది.నటుడు, దర్శకుడు ఆర్‌నారాయణ మూర్తి చెప్పినట్లు మధ్యపానం, ధూమపానం ఆరోగ్యానికి హాని కరమంటూనే ప్రభుత్వాలు ఆదాయం కోసం వాటిని వినియోగించుకునే దుష్ట సంప్రదాయాన్ని వదులుకోవాలి. అకున్ సబర్వాల్ సోమవారం రాత్రి విలేకరులతో మాట్లాడుతూ చిత్రపరిశ్రమ వ్యక్తులనే లక్ష్యంగా చేసుకున్నారని అధికారులపై విమర్శలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలను విచారించడం చట్టవిరుద్ధం అని అధికారులు వెల్లడిస్తూ, స్టార్ హోటళ్ల మేనేజర్లను విచారిస్తాం అన్నారు. సార్ మాకు హెచ్చరికలు, విచారణలు కాదు కావాల్సింది.. యువతను నిర్వీర్యం చేసి, దేశ భవిష్యత్‌కు ఆధారమైన పిల్లలకు సైతం డ్రగ్స్ సరఫరాచేస్తూ సమాజాన్ని అస్తవ్యస్తం చేస్తున్న అసలైన మాదకద్రవ్యాల ముఠాను పట్టుకొని అంకుశం సినిమాలో విలన్ రామిరెడ్డిని చార్మినార్ చౌరస్తాలో రాజశేఖర్‌లా కొట్టుకుంటూ తీసుకురండి... ఒక్కసారి నిజాయితీగల అధికారులు తలుచుకుంటే ఎలా ఉంటుందో చూపండి సార్ ..అంటున్నారు నగరవాసులు..

– బోస్

## స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి : సీఎస్ ఆదేశం

**రా.వా.ప్రతినిధి– అమరావతి :** తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆవరణంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించతలపెట్టిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఆగష్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సీఎస్ సమీక్షించారు. ఎక్కడా ఎలాంటి చిన్న పొరపాటుకు ఆస్కారం లేని విధంగా సంబంధిత శాఖల పరంగా చేయాల్సిన ఏర్పాట్లన్నింటిని పటిష్టవంతంగా చేయాలని స్పష్టం చేశారు. పోలీసుశాఖ తరుపున ఒక సీనియర్ పోలీసు అధికారిని లైజన్ అధికారిగా నియమించాలని పోలీసుశాఖను ఆదేశించారు. మున్సిపల్ అధికారులు కార్యక్రమం జరిగే ప్రాంతంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చడంతో పాటు తాగునీటి వసతి కల్పించాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు వచ్చేరాష్ట్ర ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులకు తగిన ఏర్పాట్లు చేయడంతో పాటు ఇతర ప్రముఖులు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను సీఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ఈ సమావేశంలో సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి ఎన్.శ్రీకాంత్,ఐజీ బెటాలియన్స్ ఆర్.కె.మీనా, బెటాలియన్స్ డిఐజీ విజయకుమార్, చిత్తూర్ జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న, సమాచార శాఖ కమిషనర్ ఎస్. వెంకటేశ్వర్, సమాచార శాఖ అదనపు సంచాలకులు ఎం.కృష్ణానంద్, ప్రోటోకాల్ విభాగ సంయుక్త కార్యదర్శి అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 8,9,15 తేదీల్లో పలు రైళ్లు రద్దు



**రైల్వేస్టేషన్ (విజయవాడ) :** నెల్లూరు జిల్లా నాయుడు పేట వద్ద జరుగుతున్న రైల్వే అభివృద్ధి పనుల నేపథ్యంలో ఆగస్టు 8,9,15వ తేదీల్లో పలు రైళ్లు రద్దు చేస్తున్నట్టు విజయవాడ డివిజన్ ఇన్‌చార్జ్ పీఆర్వో జె.వి.ఆర్.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మరికొన్ని రైళ్లను దారి మళ్లించనున్నట్టు పేర్కొన్నారు. కాగా, చైన్నె సెంట్రల్–హౌర కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 15వ తేదీ రాత్రి 8.45 గంటలకు చైన్నెలో బయలు దేరుతుందని తెలిపారు. సూళ్లూరుపేట–నెల్లూరు రైలు (66032) ఆగస్టు 8న రద్దు నెల్లూరు–సూళ్లూరుపేట రైలు (66032) ఆగస్టు 8న రద్దు సూళ్లూరుపేట– నెల్లూరు రైలు (66029) ఆగస్టు 15వ తేదీ రద్దు నెల్లూరు– సూళ్లూరుపేట రైలు (66030 ఆగస్టు 15వ తేదీ రద్దు

**వయా రేణిగుంట, అరక్కోణం మీదుగా దారి మళ్లించే రైళ్ల వివరాలు**

ఆగస్టు 7 : హౌరా– కన్యా కుమారి రైలు (12665), హజ్రత్ **నిజాముద్దీన్–చెన్నై (12612),**

ఇండోర్– తిరువనంతపురం (22645), ధన్‌బాద్– అలపూజ ఎక్స్‌ప్రెస్ రైలు (13351), హౌరా– చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ (12841)

ఆగస్టు 14 : ఎర్నాకుళం– పాట్నా ఎక్స్‌ప్రెస్ (22643)

ఆగస్ట్ 15 : చెన్నై సెంట్రల్ – లక్నో ఎక్స్‌ప్రెస్ (16093), చెన్నై ఎగ్మోర్–గయ ఎక్స్‌ప్రెస్ (12390)




Printed by Pattan Hussain Khan, published by Pattan Hussain Khan on behalf of Vastitude media pvt ltd.and printed at Jagathi Publications Ltd.
D.No: 5-625,Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. publised at 6-45/1, Rayapudi, Guntur (DT), A.P. Editor: Pattan Hussain Khan,
Ph: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622. Postal Regd. No.GTR/84/2016-18